ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -186 పేజీలు - 08 వెల - 04/- బుధవారం 30 ఏప్రిల్ 2025

## పెగాసస్ నివేదికను బహిర్గతం చేయబోం




పెగాసస్ నివేదికపై సుప్రీం కీలక వ్యాఖ్య.. దేశ భద్రతే ముఖ్యమని వెల్లడి

నివేదికను వీధి చర్చల అంశంగా మార్చకూడదని ధర్మాసనం వ్యాఖ్య

వ్యక్తిగత గోప్యతా ఉల్లంఘన ఆందోళనలను పరిశీలించే అవకాశం ఉందని సూచన

2లో

# ఆర్థిక ప్రగతికి మద్దతివ్వండి

- బ్యాంకర్లకు సీఎం పిలుపు
- రాష్ట్రానికి భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయి
- పీపీపీ విధానం విస్తృతంగా అమలు
- పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలి
- మత్స్యకారులకు నేరుగా రుణాలివ్వాలి
- డ్వాక్రా, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఎదుగుదలకు సాయం చేయాలి
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ భేటీలో సీఎం
- 2025-26కు 6.60 లక్షల కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక విడుదల

2లో



ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంపదసృష్టి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా వచ్చే నాలుగేళ్లలో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నాం. ఓవైపు ఇంటికో పారిశ్రామికవేత్త లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. మరోవైపు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలు, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. 2029కల్లా పేదరికం నిర్మూలించేలా జీరో పావర్టీ-పీ4 విధానం అమలు చేసి, అసమానతలు తొలగించేందుకు కృషి చేస్తున్నాం.

\- సీఎం చంద్రబాబు

## ప్రజా వ్యతిరేక అంశాలపై గట్టిగా పోరాడాలి



- వైసీపీ జిల్లా అధ్యక్షులతో వైఎస్ జగన్ సమావేశం
- క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై ప్రధాన చర్చ
- ప్రతిపక్షంలో చురుకైన పాత్ర పోషించాలని నేతలకు పిలుపు

అమరావతి, **ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :** వైసీపీ అధినేత జగన్ పార్టీ పునర్నిర్మాణంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా పార్టీ జిల్లా అధ్యక్షులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతిపక్షంగా సమర్థవంతంగా పని చేయాల్సిన తీరుపై ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే నాయకుల్లో ఉండే నిజమైన నాయకత్వ ప్రతిభ బయటపడుతుందని అన్నారు. "భారీ లక్ష్యం ఉన్నప్పుడే బ్యాట్స్‌మన్ ప్రతిభ ఏంటో తెలుస్తుంది. అప్పుడే అతడు ప్రజలకు ఇష్టమైన ఆటగాడు అవుతాడు. మిగతాది 2లో...

## ప్రతిష్ఠాత్మకంగా మిస్ వరల్డ్ పోటీలు

### మిస్ వరల్డ్ పోటీలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- మే 10న మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం
- అతిథులు, పోటీదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సీఎం ఆదేశం
- విమానాశ్రయం, హోటళ్లు, చారిత్రక ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రతకు సూచన



2లో

## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ




5లో

# సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

### సైన్యం నిర్ణయం మేరకు ఆపరేషన్ నిర్వహణ

- భారత సైన్యం శక్తి సామర్థ్యాలపై అపార నమ్మకం
- ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోడీ విస్పష్ట ప్రకటన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :** ఉగ్రవాదాన్ని అణిచివేసే విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆపరేషన్ నిర్వహణ, సమయం, తేదీ, టార్గెట్‌లను సైన్యమే నిర్ణయిస్తుందని, భారత దళాల సామర్థ్యంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. పహల్గాం దాడి అనంతర పరిణామాలు, భద్రత, సన్నద్ధతపై ప్రధానమంత్రి తన నివాసంలో మంగళవారం సాయంత్రం కీలక సమావేశం నిర్వహించారు. సుమారు గంటన్నర సేపు ఈ సమావేశం జరిగింది. పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు దారుణ మారణహోమానికి పాల్పడి వారం రోజులు పూర్తయింది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు. ఈ దాడి తర్వాత కేంద్రం పాకిస్థాన్‌కు బుద్ధి వచ్చేలా పలు నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద నిర్మూలనకు దృఢచిత్తంతో ఉన్నమని ప్రధాని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణిచివేయడం జాతీయ సంకల్పం అని ఆయన అన్నారు. సాయుధ దళాల సామర్థ్యంపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన తెలిపారు.

మిగతాది 2లో...



## దేశమంతా ఏకమవ్వాలి

- మతం పేరుతో చంపేస్తుంటే చూస్తూఊరుకోవాలా ?
- కాశ్మీర్ ఘటన క్షమించరాని నేరం
- ఉగ్రవాదులపై కనికరం చూపాల్సిన అవసరం లేదు
- మధుసూధన్ రావు కుటుంబానికి 50 లక్షల సాయం
- మృతులకు జనసేన పక్షాన సంతాపం
- కఠిన చర్యలే మందు అన్న పవన్ కళ్యాణ్

2లో

మంగళగిరిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్,ఇతర నాయకులు పాల్గొన్నారు.మృతులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఉగ్రదాడి మృతులకు డిప్యూటీ- సీఎం నివాళులు అర్పించారు.

## ఏపీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్ ఏడాది పొడిగింపు

- కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీపి కబురు చెప్పిన ఏపీ ప్రభుత్వం
- 2026 మార్చి 30 వరకు కొనసాగింపునకు ప్రభుత్వం నిర్ణయం
- ఆర్థిక శాఖ అనుమతితో నియామకం అయిన వారికే వర్తింపు

**అమరావతి, ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవా కాలాన్ని మరో సంవత్సరం పాటు పొడిగిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మిగతాది 2లో...

## ఉగ్రదాడిపై చర్చిద్దాం

### ఉగ్రదాడి నేపథ్యంలో మోదీకి రాహుల్ గాంధీ లేఖ

పార్లమెంట్ ప్రత్యేక సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని కోరిన రాహుల్

దాడి బాధితులకు నివాళి, భవిష్యత్ చర్యలపై చర్చకు పిలుపు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :** ఉగ్రవాదంపై దేశం ఐక్యత చాటాలని లేఖలో విజ్ఞప్తి జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి ఘటన తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సంయుక్తంగా ఈ లేఖను పంపారు. పహల్గామ్ దాడి పరిణామాలపై చర్చించేందుకు వీలైనంత త్వరగా పార్లమెంట్ ఉభయ సభల మిగతాది 2లో...



# దేశమంతా ఏకమవ్వాలి

మంగళగిరి **ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :**
కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్నంత వరకు ప్రశాంతంగా ఉందని.. అధికారం రాష్ట్రం చేతిలోకి వెళ్లగానే ఊచకోత ఘటన జరిగిందని జనసేనాని, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇంత దారుణానికి ఒడిగట్టిన ఉగ్రవాదులపై కనికరం చూపాల్సిన అవసరం లేదన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించాల్సింఇదేనని, అందుకు ఎంతటి కఠినమైన చర్యనైనా తీసుకోవాల్సిందేనని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. దేశమంతా ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడిలో అమరులకు జనసేన సంతాపం ప్రకటించింది. మంగళగిరిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో డిప్యూటీ సీఎం
పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్,ఇతర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మృతులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఉగ్రదాడి మృతులకు డిప్యూటీ–సీఎం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. అమాయకులను అత్యంత దారుణంగా చంపారన్నారు. ఉగ్రదాడి ఘటన దేశం మొత్తాన్ని కుదిపేసిందని.. పహల్గామ్ ప్రకంపనలు దేశమంతా వ్యాపించాయని తెలిపారు. షికారుకు వచ్చినట్లు–వచ్చి పర్యాటకులను వేటాడారని.. ఐడీ కార్డులు అడిగి హిందువా, ముస్లింవా అని అడిగి మరీ అత్యంత క్రూరంగా అమాయకుల ప్రాణాలు తీశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిహద్దు



భద్రత అత్యంత అవసరమన్నారు. నిరాయుధులతో యుద్ధం చేయకూడదని తెలిపారు. ఎంతో నమ్మకంతోనే కశ్మీర్ పర్యటనకు వెళ్లారన్నారు. లక్షలాదిమంది కశ్మీరీ పండిట్లు వలస వెళ్లిపోయారని తెలిపారు. అప్పటి నుంచి కశ్మీర్ మండుతూనే ఉందన్నారు. కశ్మీర్ భారత్‌లో భాగమే.. ఎప్పటికీ అంతే అని స్పష్టం చేశారు. భారత్‌లో ఉంటూ కొందరు పాకిస్థాన్‌కు మద్దతుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పాకిస్థాన్‌పై ప్రేమ ఉన్నవారు ఆ దేశం వెళ్లిపోవచ్చని అన్నారు. మతం అడిగి చంపేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతుంటే నమ్మరెందుకని ప్రశ్నించారు. అతిమంచితనం కూడా మంచిది కాదని అభిప్రాయపడ్డారు. కాల్చుకుంటూ పోతే చూస్తూ ఊరుకోవాలా.. అతి సహనం కూడా ప్రమాదకరమన్నారు. పాకిస్థాన్‌ను మూడు సార్లు ఓడించామని గుర్తుచేశారు. జనసేన ఉన్నది తెలుగు రాష్ట్రాల్లోనే.. కానీ మాది జాతీయ విధానమని చెప్పుకొచ్చారు. ఉగ్రవాదులను ఎదుర్కోవాలంటే ధైర్యంతో కూడుకున్న పని అని అన్నారు. హిందువులకు ఉన్నది ఒక్కటే దేశమని.. ఇక్కడ కూడా హిందువులనే టార్గెట్ చేస్తే ఎక్కడికి పోవాలని అన్నారు. హత్య చేసి మోదీకి చెప్పుకోండి అన్నారని.. పర్యాటకులు చెబుతున్నారని తెలిపారు.
ఉగ్రదాడిలో చనిపోయిన మధుసూదన్ కుటుంబానికి పరిహారం ప్రకటించారు పవన్. జనసేన పక్షాన మదుసూదన్ కుటుంబానికి యాభై లక్షలను ప్రకటించారు. అతని కుటుంబానికి జనసేన పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 'మనం ఏదొక రూపంలో ప్రాణాలు కోల్పోతాం. అది దేశంకోసం అయితే... మన మరణానికి ఒక అర్థం ఉంటుంది. మదుసూదన్ కుటుంబం ఆ పరిస్థితి నుంచి బయటకు రావడం చాలా కష్టం. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారందరికి జనసేన పక్షాన నివాళి అర్పిస్తున్నాం' అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

(మొదటి పేజి తరువాయి)
తీవ్రవాదం అణిచివేయడంలో, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవడంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ పూర్తిగా సైన్యానిదే అని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని అధ్యక్షతన ఈ సమావేశం దాదాపు గంటన్నరపాటు–కొనసాగింది. ఈ సమావేశంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ పాటు–వివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలనేదే దేశ సంకల్పమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో అంతర్గత భద్రత, సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ తన నివాసంలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ.. ఉగ్రవాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని పాతాళంలో తొక్కేస్తామని స్పష్టం చేసినట్లు– తెలుస్తోంది. అంతేకాదు, వారి ఊహకందని రీతిలో చర్యలు ఉంటాయని చెప్పినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రఘటనకు ప్రతీకార దాడులు తప్పవని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రధాని మోదీ మాటలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మరోవైపు భద్రతారంగ కేబినెట్ కమిటీ బుధవారం సమావేశం కానుంది. వారం రోజుల వ్యవధిలో భేటీ– కానుండటం రెండోసారి. అనంతరం మోదీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ– సమావేశం కానుందని సమాచారం. ఇందులో సీసీఎస్‌లోని ఐదుగురు సభ్యులతో పాటు–రవాణా, ఆరోగ్య, వ్యవసాయ, రైల్వే మంత్రులు ఉన్నారు. ఇలా కీలక భేటీ–లు జరిగే ఒకరోజు ముందే త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు– చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే, 2016లో ఉరిలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం మెరుపుదాడులు చేసింది. అనంతరం 2019లో సీఆర్పీఎఫ్ బలగాలే లక్ష్యంగా పుల్వామాలో జరిగిన దాడి అనంతరం భారత సైన్యం సర్జికల్ స్ట్రయిక్స్ చేపట్టిన సంగతి తెలిసిందే.

# ఆర్థిక ప్రగతికి మద్దతివ్వండి

### బ్యాంకర్లకు సీఎం పిలుపు

అమరావతి, **ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :**
రాష్ట్ర ఆర్థిక ప్రగతికి బ్యాంకులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రాష్ట్రానికి భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయని, స్వర్ణాంధ్ర–2047 విజన్‌కు అనుగుణంగా పని చేస్తూనే.. 2029కల్లా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని, వీటన్నింటికీ బ్యాంకులు సహకారం అందించాలన్నారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 231వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 6,60,000 కోట్లతో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను సీఎం ఆవిష్కరించారు. అలాగే 2024–25లో సాధించిన ఫలితాలపై బ్యాంకింగ్ అధికారులతో చర్చించిన సీఎం.. వంద శాతం లక్ష్యాలను అధిగమించి, దక్షిణ భారతదేశంలోనే మేటిగా ఉన్నందుకు వారిని అభినందించారు. అలాగే 2025–26 లక్ష్యాలను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. ఏరంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరి అని చెప్పారు. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు బ్యాంకులు అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని చెప్పారు. %ఆర్థికాభివృద్ధిలో విశాఖ అనూహ్య పురోగతి సాధిస్తోందని, పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందుతోందని అన్నారు. భవిష్యత్ అవసరాలకు అమరావతిని వేదికగా చేస్తున్నామని, అటు రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను సైతం బలోపేతం చేసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మధ్యవర్తుల ప్రమేయంతో మత్స్యకారులు నష్టపోతున్నందున వారికి నేరుగా రుణాలు ఇవ్వాలని కోరారు. సముద్ర ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చునని చెప్పారు. దీనికి బ్యాంకర్ల మద్దతు చాలా అవసరం అన్నారు. డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏం చేయగలం అనేది బ్యాంకర్లు ఆలోచించాలని చెప్పారు. 2025–26లో నిర్దేశించుకున్న రుణ ప్రణాళిక లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడల్లా తరచూ ఎస్ఎల్‌బీసీ సమావేశాలు నిర్వహించడానికి ప్రధాన కారణం.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బ్యాంకుల మద్దతు కూడగట్టేందుకేనని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సేవలు, పరిశ్రమల రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని, కానీ రాష్ట్ర విభజన తర్వాత ప్రాధాన్యతలు మారాయని తెలిపారు. ఏపీవ్యవసాయరంగ ఆధారితరాష్ట్రం కావడం, దీనిపై ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తుండటంతో వ్యవసాయ రంగానికి అండగా నిలిచామని చంద్రబాబు చెప్పారు. ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్‌ను తీసుకురావాలన్న సీఎం చంద్రబాబు ఆశయం మేరకు వార్షిక రుణ ప్రణాళికలు అమలు చేస్తున్నామని సమావేశంలో బ్యాంకర్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా లక్ష్యాన్ని అధిగమిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా మహిళా ఎంటర్‌ప్రెన్యూర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా అందిస్తామని, విద్యా, గృహనిర్మాణాల విషయంలో ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ విజయానంద్, ఎస్ఎల్‌బీసీ ప్రెసిడెంట్ మణిమేఖలై, పలువురు బ్యాంకర్లు, ఆర్బీఐ అధికారులు పాల్గొన్నారు.

# పెగాసస్ నివేదికను బహిర్గతం చేయబోం

న్యూఢిల్లీ, **ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :**
పెగాసస్ స్పైవేర్ వివాదంపై సాంకేతిక కమిటీ సమర్పించిన నివేదికను బహిర్గతం చేయలేమని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన సున్నితమైన అంశాలున్నందున ఈ నివేదికను బయటపెట్టలేమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.దేశ భద్రతకు సంబంధించిన నివేదికలోని అంశాలను బహిరంగ చర్చకు పెట్టడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. "దేశ భద్రత, సార్వభౌమాధికారానికి సంబంధించిన ఏ నివేదికనూ మేం బహిర్గతం చేయబోం. అటువంటి నివేదికలను వీధి చర్చల పత్రంగా మార్చకూడదు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పెగాసస్ వ్యవహారంపై దాఖలైన




పిటిషన్ల విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.ఇదే సమయంలో వ్యక్తిగత గోప్యతా ఉల్లంఘనకు సంబంధించిన ఆందోళనలను పరిష్కరించే విషయాన్ని పరిశీలించవచ్చని ధర్మాసనం సూచనప్రాయంగా తెలిపింది. గోప్యతా హక్కుకు భంగం వాటిల్లిందని భావించే వ్యక్తుల నిర్దిష్ట కేసులను పరిశీలించే అవకాశం ఉందని సంకేతాలిచ్చింది. దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూనే, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన ఫిర్యాదులను వినేందుకు సుప్రీంకోర్టు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. పెగాసస్ వ్యవహారంలో సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సాంకేతిక నిపుణుల కమిటీని గతంలో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ నివేదికను సమర్పించినప్పటికీ, దానిలోని అంశాలను గోప్యంగా ఉంచాలని సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయించింది.

## ప్రజా వ్యతిరేక అంశాలపై గట్టిగా పోరాడాలి

(మొదటి పేజి తరువాయి)
రాజకీయాల్లో కూడా ఇది అంతే. ప్రతిపక్షంలో మనం చేసే పనుల ద్వారానే మనల్ని మనం నిరూపించుకుంటాం. ప్రజల్లో, పార్టీలో గౌరవం, ఇమేజ్ పెరుగుతాయి. మన పనితీరుతోనే మన్ననలు పొందగలుగుతాం. అందరూ ధోనీలా తయారు కావాలి" అని చెప్పారు.జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై తక్షణం స్పందించి, బాధితులకు అండగా నిలవాలని జిల్లా అధ్యక్షులకు జగన్ పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక అంశాలపై గట్టిగా పోరాడాలని, పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించాలని స్పష్టం చేశారు. "మనం రాజకీయ నాయకులం. మన జీవితాలను రాజకీయాలకే అంకితం చేశామన్న విషయాన్ని మర్చిపోవద్దు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకూడదు. ప్రతిపక్షంగా మనకు లభించిన అవకాశాలను వృథా చేసుకోకూడదు" అని సూచించారు.
జిల్లా స్థాయిలో ప్రజా సంబంధిత అంశాలను సమర్థవంతంగా వెలుగులోకి తీసుకొస్తేనే ప్రజలకు మరింత చేరువ కాగలమని జగన్ అన్నారు. తిరిగి అధికారంలోకి వస్తేనే ప్రజలకు మరింత మంచి చేయగలమని, ఆ తపనతోనే రాజకీయాలు చేస్తున్నామని తెలిపారు. తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ప్రతి ఇంట్లో తన ఫోటో ఉండాలనుకున్నానని, అదే స్ఫూర్తితో జిల్లా అధ్యక్షులు కూడా తమ సేవలతో ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. పార్టీ నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కూడా ఈ సందర్భంగా ఆయన జిల్లా అధ్యక్షులకు సూచించారు.

## ఏపీలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్ ఏడాది పొడిగింపు

(మొదటి పేజి తరువాయి)
రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, జిల్లా కార్యాలయాల్లో పనిచేస్తున్న అనేక మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల పదవీకాలం ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగిసింది. ఈ నేపథ్యంలో, వారి సర్వీసులను 2026 మార్చి 30వ తేదీ వరకు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేశారు.
అయితే, ఈ సేవల పొడిగింపునకు ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. గతంలో ఆర్థిక శాఖ ముందస్తు అనుమతితో నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే ఈ పొడిగింపు ప్రయోజనం వర్తిస్తుందని ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిబంధన పరిధిలోకి రాని వారికి ఈ పొడిగింపు వర్తించదు.అంతేకాకుండా, భవిష్యత్తులో కొత్తగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకోవాలంటే, తప్పనిసరిగా ముందుగా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా కొత్త కాంట్రాక్ట్ నియామకాలు చేపట్టరాదని తెలిపింది.

## ఉగ్రదాడిపై చర్చిద్దాం

(మొదటి పేజి తరువాయి)
పత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని వారు తమ లేఖలో ప్రధానిని కోరారు.
ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం యావత్తూ ఐక్యంగా నిలుస్తుందనే బలమైన సందేశాన్ని ప్రపంచానికి అందించాల్సిన అవసరం ఉందని రాహుల్, ఖర్గే తమ లేఖలో నొక్కి చెప్పారు. పహల్గామ్ ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి సభ నివాళులర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన భద్రతా చర్యలపై పార్లమెంట్ వేదికగా సమగ్రంగా చర్చించాలని వారు విజ్ఞప్తి చేశారు.మరోవైపు, పహల్గామ్ దాడి జరిగిన వెంటనే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై, ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదంపై పోరులో కేంద్ర ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. అనంతరం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ప్రభుత్వానికి మద్దతు ప్రకటించడంతో పాటు, తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. అయితే, ఆ కీలక సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కాకపోవడాన్ని మల్లికార్జున ఖర్గే అప్పట్లోనే తప్పుబట్టారు.ప్రధాని స్వయంగా హాజరై పరిస్థితిని వివరిస్తే బాగుండేదని ఖర్గే అభిప్రాయపడ్డారు. ఇప్పుడు మరోసారి పార్లమెంట్ సమావేశాల ఆవశ్యకతను గుర్తుచేస్తూ రాహుల్ గాంధీతో కలిసి ప్రధానికి లేఖ రాశారు. వీరితో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు కూడా ఇదే తరహా డిమాండ్లు చేశారు. టీఎంసీ నేత సుదీప్ బందోపాధ్యాయ, ఆప్ నేత సంజయ్ సింగ్ ఈ దాడి ఘటన భద్రతా వైఫల్యాలను ఎత్తిచూపుతోందని, దీనిపై ప్రధాని వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ సైతం ప్రధానికి లేఖ రాస్తూ, ఉగ్రవాదంపై దేశం ఐక్యంగా ఉందని చాటేందుకు పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం చేయాలని, ఇందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

## గ్రూప్ 1లో అక్రమాలు .. పీఎస్ఆర్‌పై మరో కేసు నమోదు

అమరావతి, **ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :**



వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుపై మరో కేసు నమోదైంది. ఇదివరకే ముంబయి నటి కాదంబరి జత్వానీ కేసులో అరెస్టై ఆయన విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయన వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.అయితే ఆ సమయంలో గ్రూప్ 1 (2018) ప్రధాన పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన వ్యవహారంలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు రావడంతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని రహస్యంగా ఉంచిన అధికారులు కేసు విచారణ బాధ్యతలను ఓ సీనియర్ అధికారికి అప్పగించినట్లు తెలుస్తోంది.ఏపీపీఎస్సీ నుంచి అందిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ జరపాలని డీజీపీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పీఎస్ఆర్‌పై విజయవాడ సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో తాజాగా మోసం, నిధుల దుర్వినియోగం, నేరపూరిత కుట్ర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలు దీనిపై దర్యాప్తు ప్రారంభించాయని, ప్రాథమిక విచారణ పూర్తయిన తర్వాత ఈ కేసును ఏసీబీకి బదిలీ చేసే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

## ప్రతిష్ఠాత్మకంగా మిస్ వరల్డ్ పోటీలు

ప్రతిష్ఠాత్మక మిస్ వరల్డ్ – 2025 పోటీలకు హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. పోటీల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న సన్నాహక పనులను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు.మే 10వ తేదీ నుంచి మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్నాయని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో, పోటీల్లో పాల్గొనేవారికి, హాజరయ్యే దేశ, విదేశీ అతిథులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. వారి బస, ప్రయాణం వంటి విషయాల్లో లోటుపాట్లు ఉండకూడదని స్పష్టం చేశారు.అంతర్జాతీయ స్థాయి కార్యక్రమం కావడంతో భద్రతాపరమైన అంశాలపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముఖ్యంగా విమానాశ్రయం, అతిథులు బస చేసే హోటళ్లు, వారు సందర్శించే అవకాశం ఉన్న చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నగరానికి వచ్చే అతిథులు హైదరాబాద్‌లోని పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా అనువైన ఏర్పాట్లు చేయాలని కూడా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.పోటీల ప్రారంభానికి సమయం దగ్గరపడుతున్నందున, నగర సుందరీకరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 30 ఏప్రిల్ 2025

# స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య సేవలు చిరస్మరణీయం.

### -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ.



**ఆంధ్ర ప్రగతి డోన్ ఏప్రిల్ 29:** ఏప్రిల్ 29 వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి సందర్భంగాడోన్ పట్టణం సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో మన భారత స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యుడు, పద్మ భూషణ పురస్కార గ్రహీత. కళా ప్రపూర్ణ బిరుదు గ్రహీత వావిలాల గోపాలకృష్ణయ్యవర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను,శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు.

# సాగు నీటి పన్ను వసూలుకు చర్యలు చేపట్టండి.

### -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్, 29:** ఏళ్ల తరబడి పేరుకుపోయిన సాగునీటి పన్ను బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సాగు నీటి పన్ను వసూళ్లు, ఆయకట్టు స్థిరీకరణపై ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ సాగునీటి కాలువల ద్వారా సాగు చేసిన భూములకు నీటిపారుదల రుసుం వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కెసి కెనాల్ ద్వారా 1,62,854.46 ఎకరాలకు, ఎస్ఆర్బిసి ద్వారా 1,53,034.8 ఎకరాలకు, తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా 1,28,246.73 ఎకరాలకు, మైలవరం రిజర్వాయర్ ద్వారా 740.21 ఎకరాలకు, శివ భాష్యం సాగర్ ప్రాజెక్టు ద్వారా 12,092 ఎకరాలకు, 104 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 40,056.79 ఎకరాలకు నీరు అందివ్వడం జరుగుతుందన్నారు. అందుకు గాను మాన్యువల్ ప్రకారం దాదాపు 20 కోట్ల డిమాండ్ మేర సాగునీటి పన్ను వసూళ్లు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఉన్న 360 గ్రామాల నుండి నీటి పన్ను వసూలు చేయడం జరుగుతోందని మిగిలిన 104 గ్రామాలకు నీటి పన్ను వర్తించరాదన్న అంశంపై ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది పునఃపరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే నీటి పన్ను కోసం 338 గ్రామాల వివరాలు ఆన్లైన్ లో నమోదు చేయడం జరిగిందని పెండింగ్ ఉన్న 24 గ్రామాల వివరాలను కూడా బుధవారం సాయంత్రం లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు పాత బకాయిలు, 1431 ఫసిలి వరకు నీటి పన్ను మొత్తం దాదాపు 20 కోట్ల రూపాయలుగా లెక్కించడం జరిగిందని, లెక్కించిన మొత్తాన్ని త్వరితగతిన వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి 21,300 ఎకరాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందివ్వడం జరుగుతుందన్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ను ఆయకట్టు స్థిరీకరణ చేసేలా రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నీటిపారుదల శాఖ సూపరింటెండ్ ఇంజనీర్లు రెడ్డి శేఖర్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న హుండీ ఆదాయం రూ 3 కోట్ల61 లక్షలు.



**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం ఏప్రిల్ 29:** శ్రీశైలం మల్లన్న ఆలయంలో ఉభయ ఆలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్ల ఉభయ ఆలయాలు,పరివార దేవాలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు చంద్రవతి కళ్యాణ మండపంలో పకడ్బందీగా ఈ లెక్కింపు నిర్వహించగా శ్రీశైలం మల్లన్న దేవస్థానానికి 3 కోట్ల 61 లక్షల 42 వేల 016 రూపాయల నగదు రాబడిగా లభించిందని దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ ఆదాయాన్ని గత 28 రోజులులో శ్రీ స్వామి అమ్మవార్లకు భక్తులు నగదును కానుకల రూపంలో సమర్పించినట్లు వెల్లడించారు. ఈహుండి లెక్కింపులో నగదుతో పాటు 105 గ్రాముల 400 మిల్లి గ్రాములు బంగారం అలానే వెండి 4 కేజీల 860 గ్రాములు లభించగా నగదు బంగారుతో పాటు యుఎస్ఏ డాలర్లు 115 ,యూఏఈ దిర్హామ్సు 670 ,ఈరోస్ ,54,సింగపూర్ డాలర్లు 25, అలాగే మొదలైన వివిధ దేశాల విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి పటిష్టమైన నిఘా నేత్రాల మధ్య హుండీ లెక్కింపు జరగగా లెక్కింపులో దేవస్థానం అన్ని విభాగాలకు చెందిన అధికారులు,సిబ్బంది,శివసేవకులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ ను కనపరిచిన విద్యార్థులకు సత్కారం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 29:** 2025 మార్చి పదో తరగతి పరీక్ష ఫలితాలలో అద్భుతమైన మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం అయ్యాలూరు మెట్టకు చెందిన అబ్దుల్ రహిమాన్ 600 గాను 590 మార్కులు సాధించారు అంతేకాకుండా హైదర్ అలీ కు 589 మార్కులు సాధించారు. వీరిని నంద్యాల తాలూకా సబ్ ఇన్స్పెక్టర్ గంగా యాదవ్ మరియు నజీర్ మరియు గుర్రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ.. ఇటువంటి ఫలితాలను సాధించిన విద్యార్థులకు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అవరోధించాలని మరియు ఇంతటి మంచి ఫలితాలు సాధించిన విద్యా సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఐలూరు మెట్ట కు చెందిన ఎస్ బాబి మరియు జమాల్ పెద్దలు పాల్గొన్నారు.

# జిల్లాలో 29 యూనిట్లకు రూ.4.50 కోట్లు మేర రాయితీల మంజూరు.

### -సింగిల్ డెస్క్ పోర్టల్ క్రింద 43 దరఖాస్తులు ఆమోదం.

### -పీఎం విశ్వకర్మ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి.-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 29:** సింగిల్ డెస్క్ విధానం క్రింద జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుండి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ జి రాజ కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం జవహర్ బాబు, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ రెడ్డి, ఎల్డీఎం రవీందర్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీ కిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు 46 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ పోర్టల్ క్రింద 43 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తూ ఆమోదం తెలిపారు. మిగిలిన మూడు దరఖాస్తులను నిర్దిష్ట గడులోపు తగు చర్యలు తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ ఫ్యాక్టరీస్ అధికారులను ఆదేశించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ, పావలవడ్డీ, విద్యుత్, సేల్ టాక్స్, తదితర రాయితీల క్రింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లోని 29 యూనిట్లకు మొత్తం 4.50 కోట్ల విలువైన రాయితీ ప్రయోజనాలు మంజూరు చేసామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ యూనిట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న నేపథ్యంలో డోన్ మండలం జలదుర్తి గ్రామంలో 36.09 ఎకరాల్లో ప్రారంభించే అవకాశం ఉందని ఈ సమావేశంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 3179 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, పెండింగ్ ఉన్న 1800 దరఖాస్తులను కూడా స్టేజి 3కి తీసుకెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్కిల్ కమిటీకి కేటాయించిన లక్ష్యాలు పూర్తి చేయండి. జిల్లాలో ఉన్న స్కిల్ హబ్స్ కు కేటాయించిన లక్ష్యాలనుటిని లక్ష్యాలన్నింటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న అన్ని రకాల శిక్షణలలో ఎలాంటి సమస్యలు లేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. స్కిల్ కాలేజ్ ట్రైనింగ్స్ మరియు జాబ్ మేళాలు, ఇండస్ట్రియల్ లో వివిధ ట్రైనింగ్ ల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీమోహన్, పాలిటెక్నిక్ కాలేజ్, ఐటిఐ కాలేజ్, సీడ్ ఆప్ సిబ్బంది, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు అందించండి.

### -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్, 29:** మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మెప్మా, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 2025-26 ఆర్థిక సంవత్సర మహిళల వ్యవస్థాపకత కార్యాచరణ ప్రణాళికపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెప్మా పిడి నాగశివలీల, పరిశ్రమల శాఖ జిఎం జవహర్ బాబు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునిచ్చి ప్రోత్సహించాలన్నారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా చేయూత నిస్తోందన్నారు. జిల్లాలో హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, ఫుడ్ సర్వీసెస్, రెంటల్ షాప్స్, సర్వీస్ సెక్టార్ క్రింద 334 యూనిట్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందులో జిల్లా కేటాయించిన 1747 యూనిట్ల నెలకొల్పనకు మెప్మా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్వయం సహాయ సంఘాల మహిళల ఉత్పత్తులను ఎప్పటికప్పుడు ఓఎన్డిసి సైట్ లో అప్లోడ్ చేయాలన్నారు. నంద్యాల జిల్లా అంటే ఒక ప్రత్యేక గుర్తింపు ఉండే విధంగా ఉత్పత్తులను తయారు చేసేలా మహిళలను ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా అన్ని మున్సిపల్ ఏరియాల్లో మున్సిపల్, మెప్మా సహకారంతో కలంకారీ క్లాత్ తెప్పించి మహిళలకు నైటీలు, పెట్టికోట్స్ శిక్షణ ఇవ్వడం ద్వారా ఎక్కువ శాతం మహిళలకు ఉపాధి పొందే అవకాశాలు ఉంటాయన్నారు. మెప్మా, తృప్తి క్యాంటీన్ వారి సహకారంతో త్వరలో తృప్తి క్యాంటీన్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో కలెక్టరేట్, అన్ని మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్లు రుణాలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఓఎన్డిసి సైట్ లో స్వయం సహాయక సంఘాల మహిళలు విక్రయించే 961 ఉత్పత్తులను కలెక్టర్ ఆన్లైన్ లో పరిశీలించారు.

# శక్తి యాప్ రిజిస్ట్రేషన్ ద్వారా విస్తృత ప్రయోజనాలు.

### -జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న శక్తి టిమ్ బృందాలు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ ఏప్రిల్ 29:** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా శక్తి టిమ్ బృందాలు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.నంద్యాల పట్టణ కేంద్రంలోని మేఘన కోచింగ్ సెంటర్ మరియు జీవి మాల్ నందు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జయరాములు తాలూకా ఎస్ఐ ధనమ్మ, బనగానపల్లె గ్రామ/వార్డు మహిళా కార్యదర్శులతో మరియు టౌన్ లోని తెలుగుపేట నందు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గౌతమి ఆత్మకూర్ ఆదిత్య జూనియర్ కాలేజీ నందు ఆత్మకూర్ శక్తి టిమ్ బృందాలు శక్తి ఆప్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి మరియు ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలు, రోడ్డు ప్రమాదాలు,మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, అత్యవసర సమయంలో ఉపయోగించవలసిన టోల్ ఫ్రీ నంబర్ల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు అదికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ శక్తి యాప్ ను గూగుల్ ప్లే స్టోర్ లో నుండి డౌన్లోడ్ చేసి సెల్ఫోన్ లలో నిక్షిప్తం చేసుకోవాలని తద్వారా ఆపద సమయంలో తక్షణ సహాయం కొరకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఆపద సమయాల్లో యాప్ ని ఓపెన్ చేసి దానిలో ఉన్న ?? బటన్ నొక్కడం ద్వారా గానీ (లేదా) యాప్ లోని "హ్యాండ్ గెస్చర్" అనే సదుపాయాన్ని ఉపయోగించి ఫోనును అటూ - ఇటూ ఊపి కూడా పోలీస్ వారి సహాయాన్ని పొందవచ్చు.అంతేకాక వీటితో పాటు అదృశ్యమైన చిన్నారుల ఆచూకీ కనిపెట్టడం, బహిరంగమద్యపానం, గంజాయి, మాదకద్రవ్యాలవినియోగం, పబ్లిక్ న్యూసెన్స్ తదితర అంశాలపైన కూడా ఫిర్యాదు చేయవచ్చునని వివరించడం జరిగింది. అనంతరం ప్రస్తుతం సమాజంలో జరిగే నేరాలు అనగా మహిళలపై జరిగే నేరాలు , సైబర్ క్రైమ్ , రోడ్డు ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాలు వినియోగించడం వలన కలిగే దుష్ప్రభావాల గురించి దయచేసి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎవరైనా వాటిని వినియోగించిన సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని మీ వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలియజేశారు. సైబర్ నేరాల గురించి తెలియజేస్తూ సెల్ ఫోన్లలో తెలియని వ్యక్తుల నుండి వచ్చే అవాంఛిత సందేశాలు లింకులను క్లిక్ చేయకూడదని, మరియు మీ వ్యక్తిగత సమాచారం బ్యాంకు వివరాలు ఎవరితోనో షేర్ చేయరాదని ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నెంబర్ కు గాని **www.cybercrime.gov.in** అనే వెబ్ సైట్ లో గాని ఫిర్యాదు చెయ్యవచ్చని తెలియజేశారు.

# మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం.

### -ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత





**ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 29:** బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం ఎంతోగానో దోహపడుతుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ తోట కవిత పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలోని వెలుగు కార్యాలయంలో కిషోరి వికాసం స్పెషల్ సమ్మర్ క్యాంపెయిన్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కిశోరి వికాసం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, కిశోరి వికాస కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశంపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా బాలబాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించడంతోపాటు వాటిని ఏవిధంగా పరిష్కరించుకోవాలో సూచనలు, సలహాలు కూడా అందించాలన్నారు. బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేసుకుంటే వచ్చే అనర్థాలను వివరించడంతోపాటు వాటిని ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చాటి చెప్పాలన్నారు. మరీ ముఖ్యంగా చట్టాలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఏపీఎం తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ..ఫైనాన్స్ మేనేజ్మెంట్, బ్యాంక్ అకౌంట్స్, సేవింగ్, కిషోరి బాలికలు ఏ విధంగా ఉపయోగించుకోవాని వివరించారు. ఎంపీహెచ్ ఈ వో హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ.. కిషోరి బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, న్యూట్రిషన్, ఆరోగ్యం గురించి పలు సూచనలు, సలహాలు. చేశారు.ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, ఎమ్మెస్ కే, ఎంపీహెచ్ డబ్ల్యు ఏఎన్ఎంలు, వివో ఏలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# బేవరైజస్ కార్మికుల నియామకాల్లో జరిగిన అవినీతి పై న్యాయ విచారణ జరిపించాలి




**-కార్మికల జీవితాలతో చెలగాటమాడితే సిఐటియుగా ఆందోళన తీవ్రతరం చేస్తాం.**

**-జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 29:** నంద్యాల ఐ ఎం ఎల్ డిపోలో హమాలీల నియామకాల్లో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించడం జరిగింది ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి టీ ,రమేష్ కుమార్ సిఐటియు జిల్లా కార్యదర్శి ఏ నాగరాజు పార్టీ జిల్లా నాయకులు రామచంద్రుడు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు కే యం డి గౌస్ సిఐటియు జిల్లా కార్యదర్శిలు వి బాల వెంకట్ డి లక్ష్మణ్ పార్టీ జిల్లా నాయకులు నరసింహులు మాట్లాడుతూ న్యాయ శాఖ మంత్రి ఫరూక్, కుమారుడు, అనుమాయిలతో కోట్ల రూపాయలకు అవినీతికి పాల్పడ్డారంటూ జిల్లా ఉన్నత స్థాయి అధికారులు కూడా వారి అవినీతికి మడుగులతో కార్మిక చట్టాలను తుంగలో తొక్కి అన్యాయంగా అక్రమంగా నోటిఫికేషన్ విడుదలైన తర్వాత ఎలాంటి ఇంటర్వ్యూలో టెస్టు గానీ నిర్వహించకుండా ఎవరైతే డబ్బులు ఇచ్చారో ఎంపిక చేయటం చాలా దుర్మార్గమైన చర్య అని ఇప్పటికైనా మీరు ఎంపిక చేసిన లిస్టును క్షుణ్ణంగా పరిశీలించి ఏజ్ బారు అయిన వాళ్లను అట్లాగే చదువు లేని వారిని తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

ఐ ఎం ఎల్ ప్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల కడుపు గొట్టాలని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఫరూక్ అధికారం ఉంది కదా అని జిల్లా అధికారులను అడ్డుపెట్టుకుని ఇంటర్వ్యూలు లేకుండా లక్షల్లో డబ్బులు తీసుకుని కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన న్యాయ శాఖ మంత్రి ఫరూక్, తమ అనుమాయిల తో చేస్తున్న ఆగడాలను సిఐటియు గా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, రాజకీయ జోక్యాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేస్తున్నామని ఐ. ఎం.ఎల్ ఫ్యాక్టరీలో అక్రమంగా 36 మంది కార్మికులను చేర్పిస్తూ స్థానికంగా పనిచేస్తున్న కార్మికుల కడుపు కొడుతున్నారని ఆరోపించారు.స్థానిక న్యాయశాఖ మంత్రి ఫరూక్ జిల్లా అధికారులతో ఒక కమిటీ వేయించి అందులో జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్ గా ఉంటూ డిఆర్ఓ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ డిఎం అండ్ హెచ్ ఓ మరియు ఫ్యాక్టరీ మేనేజర్ కమిటీ సభ్యులుగా నోటిఫికేషన్ విడుదల చేయించి నారని నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం దాదాపు 170 మంది ఎలాంటి పని లేని కార్మికులు నిరుద్యోగులు అప్లై చేసుకున్నారని ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా అనుచరులు 36 మంది కార్మికుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి కోటి రూపాయలకు పైగా అవినీతికి పాల్పడి ఐఎంఎల్ కంపెనీలో ఎక్కిస్తున్నారన్నారు మిగిలిన 140 మంది అప్లై చేసుకున్న కార్మికుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.రాష్ట్ర మంత్రి ఫరూక్ అవినీతికి పాల్పడినట్లు మా వద్ద ఆధారాలున్నాయని బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ వారు సవాల్ విసిరారు. గత వైసిపి ప్రభుత్వ హాయంలో ఉన్న కార్మికులకు ఇక్కడ పని లేక పోవడంతో స్థానిక మాజీ శాసనసభ్యులు రవిచంద్ర కిషోర్ రెడ్డి ,పాణ్యం మాజీ శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి తమ అనుచరులను చేర్చుకోవాలని పంపిస్తే అక్కడ పనిచేసే కార్మికులు అల్లాడిపోతుంటే అదనంగా మరో 36 మందిని పనిలోకి తీసుకుంటే మా కుటుంబాలు రోడ్డున పడతాయని చెప్పడంతో వాళ్లు అక్కడి నుంచి వెళ్లి ఏలాంటి ప్రెజర్ చేయకుండా కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయగలిగారని, ఇప్పుడున్న టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కాకముందుకే ఇటువంటి పెద్ద ఎత్తున కోట్ల రూపాయలకు అవినీతికి పాల్పడడం కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామని, అధికారులపై ఒత్తిడి వచ్చి చేర్పిస్తున్నారని ఆరోపించారు. అధికారులు నోటిఫికేషన్ ఇచ్చి ఎలాంటి ఇంటర్వ్యూ లు, ఎంపిక చేయకుండా కేవలం మంత్రి ఇచ్చిన పేర్లనే ఎంపిక చేసినట్లు చూపించారాని అందులో ఎక్కువ శాతం నాన్ లోకల్ వాళ్లు ఉన్నారన్నారు. 40 సంవత్సరాలు పై బడిన వారిని తీసుకోవద్దని చెప్పుతూనే ప్రస్తుతం తీసుకున్న వారిలో 40 ఏళ్ల పైబడిన వారిని కూడా తీసుకున్నారని వారు వివరించారు. న్యాయం చేయాల్సిన న్యాయ శాఖా మంత్రి ఫరూక్ రాష్ట్రంలో ఎవరికి అన్యాయం జరిగినా న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉందని, అలా కాకుండా తమ నియోజకవర్గంలోనే అన్యాయం చేయాలని చూస్తే అన్యాయ శాఖ మంత్రిగా చరిత్రలో నిలిచిపోతారని, బేవరేజస్ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 36 మంది కాకుండా పనికి తగ్గట్టుగా హమాలీలను తీసుకోవాలని డిమాండ్ చేశారు.మద్యం అమ్మకాల్లో గత వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని సీట్ అధికారులతో విచారణ జరిపించి జైళ్లలో పెడుతున్నారే... మరీ కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల కాలంలోనే కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతుంటే స్పందించకపోవడం పట్ల దీంట్లో సీఎం చంద్రబాబు నాయుడు కు కొల్లు రవీంద్ర కు అనుమానం వస్తుందని లో ఐ ఎం ఎల్ ప్యాక్టరీ లో కార్మికుల నియామకాల్లో జరిగిన అవినీతిపైన ఎందుకు ప్రభుత్వం స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. ఈ విషయం పై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించాలని వారు కోరారు. కార్మికులు పనిలో చేరిన తర్వాత కూటమిలో మిగిలిన పార్టీలకు జనసేన, బిజెపి పార్టీలకు కూడా ఎంతో కొంత డబ్బులు ముట్ట చెప్పాల్సి ఇవ్వాల్సి ఉంటుంది అన్నింటికీ సిద్ధంగా ఉండాలని కార్మికుల కు చెప్పినట్లు మాటలు చెప్తున్నారని అన్నారు కార్మికులకు అన్యాయం జరుగుతుంటే సిఐటియుగా చూస్తూ ఊరుకోబోమని, ఈ విషయంలో బేవరేజస్ హమాలీ కార్మికులకు న్యాయం జరిగేంత వరకు జిల్లా వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమై పోరాడుతామని,అదే విధంగా ఇప్పటికే డబ్బులు ఇచ్చి మోసపోయిన కార్మికులకు న్యాయం జరిగేంత వరకు కూడా అండగా నిలబడతామని అవసరమైతే అన్ని రాజకీయపార్టీలను, ప్రజాసంఘాలను, మేధావులను సమీకరించి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## వీరభిమాని ఇంటికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**-చిన్నారికి రుద్రాన్స్ గా నామకరణం చేసిన ఎంపీ బైరెడ్డి శబరి**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 29:** అనుచరులకు, అభిమానులకు నేనున్నా అనే భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తన వీరభిమాని కోసం ప్రభుత్వం కార్యక్రమాలు ముగించుకొని ఆ యువకుడి ఇంటికి వెళ్లి ఆ ఊరంతా సంబురాల్లోకి తీసుకెళ్లారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పాములపాడు మండలం మిట్టకంధాల గ్రామంలో లింగాల కిరణ్ అను యువకుడు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి వీరభిమాని, తనకు కుమారుడు పుట్టాడని మీరే పేరు పెట్టాలని అంతవరకు నామకరణం చేయనని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి కిరణ్ చెప్పారు. దీంతో మంగళవారం కొత్తపల్లి మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు ముగించుకొని అభిమాని కోరిక మేరకు సాయంత్రం మిట్టకంధాలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేరుకోగానే ఊరంతా కలిసివచ్చి గ్రామ పొలిమేరలోనే మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో తరలివచ్చి పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. కిరణ్ ఇంటికి ఎంపీ శబరి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పలకరించి నామకరణ వేడుకలు ఎంపీ చేతుల మీదుగా నిర్వహించి కిరణ్ కుమారుడు కు ఎంపీ బైరెడ్డి శబరి రుద్రాన్స్ గా నామకరణం చేసి అందరిని ఆనందింపజేశారు.

## సంగమేశ్వరం, కొలనుభారతీ పుణ్య క్షేత్రాలలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక పూజలు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 29:** నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం నల్లమల అటవీ సమీపంలోని కృష్ణా నది ఒడ్డున వెలసిన సప్త నదుల కలయిక, నివృత్తి సంగమంగా ఉన్న పురాతన శ్రీ లలితా సంగమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక పూజలు చేశారు. సంగమేశ్వర ఆలయ ప్రధానార్చకులు తెలకపల్లి రఘురామశర్మ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి పూర్ణకుంభ స్వాగతం పలికి మూల విరాట్ శ్రీ లలితా సంగమేశ్వర స్వామి వార్లకు బిల్వార్చన, జలాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చన, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు తెలకపల్లి రఘురామ శర్మ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి తీర్థ ప్రసాదం అందించి ఆశీర్వదించారు.అలాగే కొత్తపల్లి మండలం శివపురం గ్రామ సమీపంలోని నల్లమల అరణ్యంలో చారుఘోషిని నది ఒడ్డున వెలసి ఏకంగా దేశం పేరుతో ప్రఖ్యాతిగాంచి నిత్య పూజలు అందుకుంటున్న చదువులతల్లి సరస్వతీ ఆలయం శ్రీ కొలనుభారతీ ఆలయం, సప్త శివాలయాలు, శ్రీ జనార్ధనస్వామి ఆలయాల్లో మంగళవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక పూజలు చేశారు. కొలనుభారతీ ఆలయ పూజారులు శ్రీనివాసశర్మ, చక్రపాణి శర్మలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికి శ్రీ కొలను భారతమ్మకు, సప్త శివాలయాల్లో, శ్రీ జనార్ధన్ స్వామి వార్లకు పూజలు చేయించి తీర్థ ప్రసాదం అందించి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని ఆశీర్వాదించారు. ఈ సందర్బంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ సంగమేశ్వరం, కొలను భారతీ పుణ్య క్షేత్రాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని భక్తులకు హామీ ఇచ్చారు.

## అభిరుచి మధు ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 29:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బిజెపి శాఖ ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు అధ్యక్షతన, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకల, సందర్భంగా మేధావుల సదస్సు, నంద్యాల జయంత్ ఫంక్షన్ హాల్ లో భారతీయ జనతా పార్టీ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర శాఖ నుండి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగోతు రమేష్ నాయుడు మరియు పోతుకుంట రమేష్ నాయుడు, మాట్లాడుతూ, గత కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ ని ప్రత్యక్ష ఎన్నికలలో ఓడిపోయేలా కమ్యూనిస్టులతో చేతులు కలిపి ఓడించిందని తెలిపారు. అలాగే బిఆర్ అంబేద్కర్ ని తీవ్రంగా అవమానించింది, ఢిల్లీలో ఆయన స్మారకార్థం ఆరడుగుల స్థలం కేచాయించకపోవడం కాంగ్రెస్ కుటిల మనస్తత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే భారతీయ జనతా పార్టీ అంబేద్కర్ నిలువెత్తు విగ్రహాన్ని పార్లమెంట్ ఆవరణలో ఆవిష్కరించిందని , భారతరత్నకు రావడానికి కృషిచేసిందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల కన్వీనర్, లింగన్న, కోకన్వీనర్ లు, మేడం మురళిధర్, ఇంటి ఆదినారాయణ , జాతీయ కౌన్సిల్ సభ్యులు, కసెట్టి కృష్ణమూర్తి, జాతీయ మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యురాలు, శ్రీమతి మోమిన్ షబానా, అడ్వకేట్ నందం బాబురావు, బి . వి సుబ్బారెడ్డి, సందు వెంకటరమణ, శివ కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శంకర భగవత్పాదుల జయంతి వేడుకలు ప్రారంభం.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ ఏప్రిల్ 29:**వైశాఖ శుద్ధ పంచమి జగద్గురువు శ్రీ ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆళ్ళగడ్డ పట్టణం, మల్లిఖార్జున శాస్త్రి వీధిలోని శ్రీ ఆదిశంకరాచార్య మందిరం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ మూడు రోజులపాటు ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజనలు, మే 2వ తేది శుక్రవారం శ్రీ ఆదిశంకరాచార్య జయంతి సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలతో పాటు ప్రముఖ సంస్కృత పండితులు డాక్టర్ దివి హయగ్రీవాచార్యులచే శంకర వైభవంపై ధార్మిక ప్రవచనం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమాలు ప్రారంభం సందర్భంగా మొదటిరోజు భక్తితత్త్వంపై విశ్రాంత జిల్లా న్యాయమూర్తి కాశీభట్ల శివప్రసాద్ ప్రవచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచార మండలి సభ్యులు టి.వి.వీరాంజనేయరావు, జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా సమన్వయకర్త సి.రామకృష్ణ, శ్రీ ఆదిశంకరాచార్య మందిర నిర్వాహకులు కాశీభట్ల వెంకట విజయలక్ష్మి, అడ్వకేట్ సాయి స్వరూప్, సత్య ప్రసాదు, శ్రీకాంత్ రెడ్డి, శ్రీ ఆదిశంకర సేవా సత్సంగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అడవి బిడ్డలకు అండగా ఉంటా.

**-పి ఎం నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబులు విజనరీ నేతలు.**

**-చెంచుగూడెంల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెస్తా.**

**-మీకు ఏ కష్టం, నష్టం జరిగినా వెంటనే నాకు ఫోన్ చేయండి.**

**-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 29:** దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందంటే వాటికీ దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులు కారణమని, పీఎం మోడీ, సీఎం చంద్రబాబు లు ముందు చూపుతో దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ విజనరీ నేతలుగా ఉన్నారని, వారి ప్రత్యేక చొరవతోనే మారుమూల గిరిజన ( చెంచు గూడెం)లకు తారు రోడ్లు, విద్యుత్ సౌకర్యం, పక్కా గృహాలు ఉచితంగా మంజూరు అయ్యాయాని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

మంగళవారం నంద్యాల జిల్లా కేంద్రానికి 120 కిలోమీటర్లు దూరం, నల్లమల దట్టమైన అరణ్యం కృష్ణానది ఒడ్డున కనీస వసతులకు దూరంగా ఉంటూ 45 ఏళ్లుగా చిమ్మ చీకటిలో జీవిస్తున్న కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప చెంచుగూడెంలకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విద్యుత్ సరఫరాను ప్రారంభించి వీధి దీపాలు వెలిగించారు.

ఈ సందర్బంగా చెంచుగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు మాకిచ్చిన మనో ధైర్యం తోనే సమాజానికి దూరంగా అడవుల్లో కనీస వసతులకు దూరంగా బ్రతుకుతున్న చెంచుల వద్దకే వచ్చి అభివృద్ధి ఫలాలు అందిస్తున్నామని, చెంచు మహిళలు కూడా తమ బిడ్డలను పనులకు పంపవద్దని బడులకు పంపి చదువు నేర్పుకోవాలని, బాగా చదువుకున్నందుననే భారతదేశం ప్రథమ పౌరురాలు ( రాష్ట్రపతి )గా గిరిజన మహిళ ద్రౌపదిముర్ము ఉన్నారని ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి చెంచు పిల్లాడు చదువుకోవాలని ఆమె కోరారు.

తాను కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 1.50 కోట్ల నిధులు ఈ మూడు చెంచు గూడెంల విద్యుత్ సరఫరాకు మంజూరు చేయించగా విద్యుత్ అధికారులు ఎంతో శ్రమతో తక్కువ సమయంలో విద్యుత్ స్థంబాలు, ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసి చెంచులకు కరెంట్ వచ్చేలా చేయడం అభినందనలు అని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. ప్రజలను హించించే నాయకులు వద్దు, నిరంతరం ప్రజల కోసం పనిచేసే నాయకులకు అండగా ఉండాలని, జిల్లాలోని అన్ని చెంచుగూడెంల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గిరిజనులకు భరోసా ఇచ్చారు. బడి, ఆసుపత్రి, అంతర్గత రోడ్లు, మంచినీటి వసతి, కరెంట్, ఉపాధి పనులు ప్రతి చెంచుగూడెంలలో కల్పించేందుకు తాను కృషి చేస్తానని, ఏకలవ్య పాఠశాలల మంజూరుకు కేంద్ర ప్రభుత్వంకు ప్రతిపాధన చేశానని మంజూరు కాగానే బడులు మొదలు అవుతాయన్నారు. ప్రధాన మంత్రి జన్ ధన్ పథకం క్రింద చెంచులకు ఉచితంగా పక్కా గృహాలు నిర్మించి ఇస్తామన్నారు. మీలో కూడా మార్పు అవసరమని ప్రభుత్వ పథకాలు అందుకొని చెంచులందరూ అభివృద్ధి చెందాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

చెంచు గూడెంలలో అధికారులు బృందంతో ఎంపీ శబరి కలియతిరిగి మహిళలు, చిన్నారులు, వృద్ధుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికలప్పుడు ఓట్లు వేయమని కూడా మా చెంచు గూడెంలకు నాయకులు వచ్చేవారుకాదని, ఎన్నికలు అయిపోయాకా ఎంపీ గా గెలిచి నిధులతో మా గూడెంలలో పర్యటన చేస్తూ మాకు అండగా, ధైర్యం చెప్పిన మా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి గిరిజన మహిళలు ఆనందభాష్పాలతో స్వాగతం పలికి నూరేళ్లు చల్లగా ఉండాలని దీవించారు.

ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో జిల్లా ఎస్ సి సుధాకర్ రావు, ఆత్మకూరు ఆర్ డి ఓ నాగజ్యోతి, ఆత్మకూరు సి ఐ సురేష్ కుమార్ రెడ్డి, ట్రాన్స్ కో డి ఈ జయశంకర్, ఏ డి ఏ రామ సుబ్రహ్మణ్యం, కొత్తపల్లి ఎం ఆర్ ఓ ఉమారాణి, ఎం పి డి ఓ దాసరి మేరీ, జడ్ పి టీ సి సోముల సుధాకర్ రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్ నాయుడు, బి ఎస్ ఎన్ ఎల్ ( టెలికామ్ సంస్థ) సలహాదారులు కురువ రమేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మాజీ జడ్ పి టీ సి నాగేశ్వరావు, మండల నాయకులు శ్రీనాథ్ రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగశేషులు యాదవ్, పుల్లారెడ్డి. కే. వెంకట శివారెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బాపూజీ నగర్ ప్రజలకు స్మశానానికి స్థలం కేటాయించాలి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 29:** నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలోని మజాల గ్రామమైన బాబూజీ నగర్ గ్రామనికీ స్మశానముకు స్థలం కేటాయించి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు నంద్యాల మండలం ఎమ్మార్వో కార్యాలయం లో తాసిల్దారు శ్రీనివాస్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వి బాల వెంకట్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బాపూజీ నగర్ గ్రామానికి గత 40 సంవత్సరాల నుండి స్మశానం లేక రోడ్డు పక్కన ఉన్న కాల్వ గట్టు పైన చనిపోయిన వాళ్లను పూడ్చుకుంటున్నారని ఇక్కడ దాదాపు 500 కుటుంబాలకు పైగా జీవనం కొనసాగిస్తున్నారని గ్రామంలో అరకరా వసతులతో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు కాలం గడుపుతున్నారని గ్రామంలో చాలా సమస్యలు తో అక్కడ ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారని గతంలో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని గత సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయిన కలెక్టర్ స్పందించి డిఆర్ఓ కు ఆర్డిఓ ని ఎమ్మార్వో ని గ్రామానికి విజిట్ చేయమని చెప్తామని చెప్పారు కానీ ఇంతవరకు ఏ ఒక్క అధికారి గ్రామం వైపు చూడలేదని ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు గ్రామాన్ని సందర్శించాలని గ్రామంలో 30 సంవత్సరాల కిందట వేసిన సిసి రోడ్లు మొత్తం చెడిపోయాయని అలాగే కరెంటు స్తంభాలు వంగి పోయాయని కాబట్టి అధికారులు వెంటనే స్పందించి బాబూజీ నగర్ గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని లేకపోతే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలను ఒప్పుకొని ఆందోళన ఉధృతం చేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# రండి బాబు రండి...

## మా లాడ్జిల్లో బసచేసిన వారికి మహానందీశ్వరుని దర్శనం ఉచితం.

**ఆంధ్ర ప్రగతి మహానంది ఏప్రిల్ 29:**
రండి బాబు రండి.. మా లాడ్జిల్లో బస చేసిన/ మా పార్టీ వారైనా మీకు మహానందీశ్వరుని దర్శనం ఉచితం అనే ప్రచారం మహానందిక్షేత్రంలో ముమ్మరంగా ప్రచారం చేసుకుంటూ మహానందిశ్వర దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం. మహానంది క్షేత్రానికి దైవ దర్శనార్థమై వచ్చే భక్తులకు టోల్గేట్ వద్ద ఆగిన సమయంలో మా లాడ్జిలో దిగితే మీకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచితంగా దైవదర్శనం చేయిస్తామని యాత్రికులను తమ తమ ప్రైవేటు లాడ్జిలకు తరలించకపోతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దీంతోపాటు క్షేత్రంలోని ఒక ప్రైవేట్ కాంట్రాక్టర్ ప్రతిరోజు పలానా వారు మా పార్టీకి సంబంధించిన వ్యక్తులు వచ్చారని సంబోధిస్తూ ఉచిత దర్శనాలకు శ్రీకారం చుట్టినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో మహానంది దేవస్థానంలో పనిచేస్తూ ప్రస్తుతం వేరే ఆలయానికి బదిలీ అయిన ఆయన రక్తసంబంధికుడు ఒక ప్రైవేటు లాడ్జిని నిర్వహించుకుంటూ తమ లాడ్జికి వచ్చే భక్తులను ఉచిత దర్శనం ప్యాకేజీ పేరుతో ఆలయంలో దర్శనం చేయించడంతో పాటు తద్వారా అదనపు ఆదాయం పొందుతున్నట్లు తెలుస్తుంది. ఆలయ సిబ్బంది కూడా గతంలో మన ఆలయంలో పనిచేసిన వ్యక్తికి సంబంధించిన రక్తసంబంధికుడు కావడంతో ఆ లాడ్జిల్లో బస చేసిన యాత్రికులకు రాచ మర్యాదలతో ఉచిత దర్శనం కావిస్తున్నట్లు ప్రచారం. బయటి ప్రాంతాల నుంచి తమ పార్టీకి చెందిన వ్యక్తులు/ సహచరులు దర్శనానికి వస్తున్నారని సమాచారం అందిన వెంటనే ఒక కాంట్రాక్టర్ ఆగ మేఘాలపై




దర్శనానికి వచ్చినవారు తమ పార్టీకి చెందిన వారిని వారికి ఉచిత దర్శనం కల్పించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతోపాటు మరికొందరు ప్రైవేట్ లాడ్జి నిర్వాహకులు కూడా తమ లాడ్జిల్లో బస చేసే వారికి ఉచిత దర్శనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. పోటాపోటీగా ఎవరికి వారు ఉచిత దర్శనాలకు శ్రీకారం చుట్టి మహానంది క్షేత్ర ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు లేదా కింది స్థాయి సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొంతమంది సిబ్బందికి లాడ్జి నిర్వాహకులు / కాంట్రాక్టర్ తో సన్నిహిత సంబంధాలు ఉన్న కారణంగా వదిలివేస్తూ ప్రవేటు వ్యక్తులకు ఆదాయం చేకూర్చడంతో పాటు తాము పనిచేసే క్షేత్ర ఆదాయానికి గండి కొడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పై అధికారులు కొంతవరకు పైరవీలతో ఉచిత దర్శనాలకు వస్తున్నవారికి బ్రేకులు వేయాలని చూస్తున్నారు. క్రింది స్థాయి సిబ్బంది కొందరు, కీలక స్థానాల్లో ఉన్న ఒకరిద్దరు ఉద్యోగులు ఇవి ఏమి పట్టించుకోకుండా చాప కింద నీరులా వ్యవహరిస్తూ ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నట్లు ప్రచారం ముమ్మరంగా సాగుతున్నట్లు తెలుస్తుంది. ఆలయంలో పనిచేసే ఉద్యోగులతో పాటు తాత్కాలిక సిబ్బంది కూడా ప్రవేట్ వ్యక్తుల పొద్బలంతో ఉచిత దర్శనాలపై ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం.

# నేడు విజయవాడకు సీఎం రేవంత్

### దేవినేని ఉమ తనయుడి వివాహానికి హాజరు -పెళ్లిలో చంద్రబాబును కలుసుకునే ఛాన్స్

**హైదరాబాద్,,ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. బుధవారం విజయవాడ వెళ్లనున్నారు.. బెజవాడలో జరగనున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు వివాహానికి హాజరు కాబోతున్నారు రేవంత్ రెడ్డి.. ఇక, విజయవాడ పర్యటన కోసం ఉదయం 9.15 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు.. ఉదయం 10.40 గంటలకు కానూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణానికి చేరుకుంటారు.. ఉదయం 10.50 గంటల నుండి 11.30 గంటల వరకు అయన కల్యాణ మండపం నందు.. దేవినేని ఉమా కుమారుడు వివాహానికి హాజరై.. వధూవరులను ఆశీర్వదించనున్నారు.. విజయవాడ నుంచి తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు సీఎం రేవంత్ రెడ్డి..
కాగా, గత వారం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు.. తన కుమారుడు వివాహానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను సీఎంకు అందించి వివాహానికి రావాల్సిందిగా ఆహ్వానించారు..



మరోవైపు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీలో పనిచేసిన రేవంత్ రెడ్డి.. దేవినేని ఉమాతో సన్నిహితంగా ఉండేవారు.. ఆ తర్వాత పార్టీ మారి.. తెలంగాణ సీఎం అయినా.. వారి మధ్య స్నేహ బంధం కొనసాగుతోంది.. దీంతో, మిత్రుడి ఆహ్వానం మేరకు ఆయన కుమారుడి వివాహానికి హాజరుకాబోతున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ఇక, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఈ వివాహానికి హాజరు అయ్యే అవకాశం ఉండడంతో.. పెళ్లి వేడుకలో రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు కలుసుకునే అవకాశం లేకపోలేదు..

# 25 ఎంపీ స్థానాలకు పరిశీలకులను నియమించిన జగన్

**పార్టీ పునర్ నిర్మాణంపై జగన్ ఫోకస్**

**ఇప్పటికే పలు మార్పులు, చేర్పులు**

**తాజాగా పార్లమెంటు పరిశీలకుల జాబితా విడుదల చేసిన వైసీపీ**



**ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :**
వైసీపీ అధినేత జగన్ పార్టీ పునర్ నిర్మాణంపై తీవ్రస్థాయిలో దృష్టి సారించారు. గత కొన్ని రోజులుగా పార్టీలో సంస్థాగతంగా మార్పులు, చేర్పులు, కొత్త నియామకాలు చేపడుతున్నారు. తాజాగా, ఏపీలోని 25 పార్లమెంటు నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.

**కొత్తగా నియమితులైన పరిశీలకులు వీరే...**

1. శ్రీకాకుళం- కుంభా రవిబాబు
2. విజయనగరం- కిల్లి సత్యనారాయణ
3. అరకు- బొడ్డేటి ప్రసాద్
4. అనకాపల్లి- శోభా హైమావతి
5. విశాఖపట్నం- కదిరి బాబూరావు
6. కాకినాడ- సూర్యనారాయణరాజు
7. అమలాపురం- జక్కంపూడి విజయలక్ష్మి
8. రాజమండ్రి- తిప్పల గురుమూర్తి రెడ్డి
9. నరసాపురం- ముదునూరి మురళీ కృష్ణంరాజు
10. ఏలూరు- వంకా రవీంద్రనాథ్
11. మచిలీపట్నం- జెట్టి గురునాథం
12. విజయవాడ- మోదుగుల వేణుగోపాల్ రెడ్డి
13. గుంటూరు- పోతిన మహేశ్
14. నరసరావుపేట- డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి
15. బాపట్ల- తూమాటి మాధవరావు
16. ఒంగోలు- బత్తుల బ్రహ్మానందరెడ్డి
17. నెల్లూరు- జంకె వెంకటరెడ్డి
18. తిరుపతి- మేడా రఘునాథరెడ్డి
19. చిత్తూరు- చవ్వా రాజశేఖర రెడ్డి
20. రాజంపేట- కొత్తమద్దిసురేశ్ బాబు
21. కడప- కొండూరు అజయ్ రెడ్డి
22. అనంతపురం- బోరెడ్డి నరేశ్ కుమార్ రెడ్డి
23. హిందూపురం- ఆర్.రమేశ్ రెడ్డి
24. నంద్యాల- కల్పలతా రెడ్డి
25. కర్నూలు- గంగుల ప్రభాకర్ రెడ్డి

# నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

### ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ




**హైదరాబాద్,,ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :** తెలంగాణ పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ సారి కొత్తగా మార్కులతో పాటు- సబ్జెక్టుల వారీగా గ్రేడ్స్ ప్రకటించనున్నారు. ఆ విధంగానే మార్క్బ మెమోలు జారీ కానున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగిన పది పరీక్షలకు 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. విడుదలయిన పదో తరగతి ఫలితాలను వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఇక నుంచి పదో తరగతి మెమోల్లో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వనున్నారు. జీపీఏ అనేది తీసివేయనున్నారు. మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడు పొందుపరచనున్నారు. చివరగా విద్యార్థి పాసయ్యారా? ఫెయిల్ అయ్యారా? అనేది వివరంగా ఇస్తారు. ఇంకా బోధనేతర కార్యక్రమంలో స్టూడెంట్స్‌కు గ్రేడ్లు ఇస్తారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీ-స్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రిస్తారు.

# అమరావతిలో ప్రధాని పర్యటన

### ఏర్పాట్లపై పోలీసులతో హోంమంత్రి ఆరా



**అమరావతి,ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :** అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభానికి మే 2న ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారు. ప్రధాని రాక సందర్భంగా ఏపీ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు- చేస్తోంది. ప్రధాని సభ జరిగే ప్రాంతాన్ని ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు పరిశీలించగా.. తాజాగా హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు. పోలీసు ఉన్నతాధికారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని పర్యటన దృష్ట్యా కట్టు-దిట్టమైన భద్రత ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధాని రాక సందర్భంగా 6 వేల మందితో భద్రత ఏర్పాటు- చేసినట్లు మంత్రి అనిత చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రజా వేదిక కూల్చివేత నుంచి విధ్వంస పాలన చేశారు. కానీ సీఎం చంద్రబాబు అభివృద్ధిపై దృష్టి పెట్టారు. అమరావతి కోసం రైతులు ఎన్నో త్యాగాలు చేశారు. అమరావతి కోసం గతంలో బస్ యాత్ర చేస్తే రాళ్ళ దాడి చేశారు. అమరావతిని మళ్లీ ప్రారంభించడం వెనక ఎంతో ఆవేదన శ్రమ ఉన్నాయి. రైతుల న్యాయ పోరాటం సహా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ గార్ల కృషి వల్ల అమరావతి పనులు రీ లాంచ్ అవుతున్నాయి. ఏపీలో ఒక పండగ వాతావరణంలో రాజధాని రీ లాంచ్ కార్యక్రమం జరుగుతోంది' అని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

-----

# కృష్ణారెడ్డి పట్టుదలకు హ్యాట్సాఫ్

### చంద్రబాబు ప్రశంసలు



**అమరావతి,ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :**
కానిస్టేబుల్ ఉదయ కృష్ణారెడ్డి సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఆల్ ఇండియా 350 ర్యాంక్ సాధించిన సంగతి తెలిసిందే. ఆయన ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ఉదయ కృష్ణారెడ్డి సక్సెస్ స్టోరీపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ మేరకు తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఉదయ కృష్ణారెడ్డిపై ప్రశంసల జల్లు కురిపించారు. ' కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్‌గా ఎదిగిన ఉదయ కృష్ణారెడ్డి ప్రయాణం.. ధైర్యం, నిరంతర కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తోంది. సాధించాలనే పట్టు-దల ప్రతీ అడ్డంకిని బద్దలు కొడుతుంది. కొత్త చరిత్రను రాస్తుంది. భవిష్యత్తు పట్టు- వదలకుండా పని చేసే వారిదే ' అని పేర్కొన్నారు.

----

# నేడు అక్షయతృతీయ పుణ్యతిథి

### శుభకార్యాలకు మంచిదని పండితుల ఉవాచ



**తిరుమల,,ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి :**
అక్షయమంటే క్షయం కానిది. ఈ రోజు అంటే బుధవారం అక్షయ తృతీయ హిందువులకు చాలా ప్రత్యేకమైన, పవిత్రమైన రోజు. ఈ పండుగను ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో శుక్ల పక్షం మూడో రోజు వస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న వచ్చింది.అక్షయ తృతీయ రోజున వివాహం, గృహప్రవేశం, కొత్త వ్యాపారం లాంటి శుభ కార్యక్రమాలు ప్రారంభించడానికి, దానధర్మాలు చేయడానికి ఉత్తమమైనదిగా పరిగణిస్తాయ. అక్షతయ తృతీయరోజున చేసే అన్ని మంచి పనులు శాశ్వత ప్రభావాన్ని చూపుతాయి. పురాణాల ప్రకారం ఈ రోజునే శ్రీ మహావిష్ణువు లక్ష్మీదేవిని పెళ్లాడాడని ప్రతీతి. పరమశివుడు కుబేరుడిని సంపదలకు సంరక్షకుడిగా నియమించాడు. ఇక, అక్షయ తృతీయ రోజు కేవలం మతపరంగానే ముఖ్యమైనది కాదు. జీవితంలో ఆనందం, శ్రేయస్సు, విజయాన్ని పొందడానికి గొప్ప అవకాశాన్ని కూడా ఇస్తుందని పండితులు చెబుతారు. అయితే, లక్ష్మీదేవి కటాక్షం దక్కాలంటే ఆమెకు ఇష్టమైన మంచి పనులనే చేయాలి. అక్షయ తృతీయ నాడు విష్ణువు, లక్ష్మి దేవికి ఆచారం ప్రకారం పూజించాలి. అక్షయ తృతీయ రోజున చేసే దానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఆహారం, బట్టలు, బంగారం, ఆవు, గొడుగు మొదలైన వాటిని దానం చేస్తే చాలా శుభప్రదం అంటారు. చేపట్టిన పనులు విజయవంతమై ఫలవంతమైనదిగా జీవితంలో ఆనందం, శ్రేయస్సు పెరుగుతుందని నమ్ముతారు. అక్షయ తృతీయ రోజున ఏదైనా కొత్త పని చేయడాన్ని శుభప్రదంగా భావిస్తారు. కొత్తగా ఆస్తి లేదా ఇంకేదైనా కొనేందుకు, ఎక్కడైనా పెట్టుబడి పెట్టేందుకు అక్షయ తృతీయ అనుకూలమైన రోజుగా భావిస్తారు.ఈ రోజున బంగారం, వెండి, వాహనం, ఇల్లు లేదా భూమిని కొంటే శుభం కలిగి అదృష్టం నడిచొస్తుందని భావిస్తారు. అందుకే అక్షయ తృతీయ రోజు బంగారం కొనడం ఓ సెటిమెంట్‌గా భావిస్తారు.

# శరవేగంగా రాజధాని పర్యటన ఏర్పాట్లు

### మరోమారు అధికారులతో పరిశీలించిన నారాయణ

**అమరావతి,,ఏప్రిల్ 29 ఆంధ్ర ప్రగతి ::** ప్రధాని మోదీ అమరావతి పర్యటన ఏర్పాట్లు శరవేగంగా పూర్తి కావస్తున్నాయి. చంద్రబాబు, మంత్రులు సమీక్షలు చేస్తూ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగేమంత్రుల కమిటీ కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తోంది. ఈ క్రమంలో దాదాపు 90 శాతం పూర్తయ్యాయని మంత్రి నారాయణ తెలిపారు. మిగిలిన పనులను బుధవారం నాటికి పూర్తిచేస్తామని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రూ.43 వేల కోట్ల పనులను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుంది. రాజధాని కోసం కేవలం 50 రోజుల్లో ఒక్క సమస్య కూడా లేకుండా రైతులు భూములు ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో రాజధాని కట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపొందించాం. 365 కి.మీ ట్రంక్ రోడ్లు, 1500 కి.మీ లే ఔట్ రోడ్లు నిర్మించేలా ప్లాన్ ఉంది. గతంలోనే రూ.41 వేలకోట్లకు పనులు ప్రారంభమయ్యాయి. 2019కు ముందు రూ.5 వేల కోట్ల బిల్లులు కూడా చెల్లించాం. గత ప్రభుత్వం రాజధానిపై మూడు ముక్కలాట ఆడింది. న్యాయపరమైన సమస్యలు లేకుండా ముందుకెళ్లేందుకు ఇంత సమయం పట్టింది. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి చేస్తాం. సోమవారం అమరావతి ప్రాంత రైతులతో సీఎం రెండుగంటలపాటు- మాట్లాడారు. 29 గ్రామాల రైతులను ప్రధాని సభకు రావాలని సీఎం స్వయంగా ఆహ్వానించారు. అమరావతిపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతులు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారని నారాయణ తెలిపారు. అన్నీ సక్రమంగా సాగుతున్నాయి. ఇక రాజధాని నిర్మాణం వేగం పుంజుకుంటుందని మంత్రి అన్నారు.

# రెండో పెళ్లితో కోట్లు కొట్టేసి రివర్సులో వార్నింగులు ఇస్తున్న కిలేడీ

**గచ్చిబౌలి :**గతంలో అమాయక ఆడోళ్లను మాటలతో మాయ చేసే మగాళ్లు బోలెడంత మంది ఉండేవారు. మారిన కాలంలో.. ఈ తరహా మోసాలు మాకూ పెద్ద విషయమేమీ కాదన్నట్లుగా మగాళ్లకు ధీటుగా కొందరు మహిళలు చేస్తున్నారు. ఈ మోసాల తీవ్రతకు మగాళ్లు పోలీస్ స్టేషన్లను ఆశ్రయిస్తున్న ఉదంతాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇప్పుడు చెప్పేది ఆ తరహా మోసమే. మాయ మాటలు చెప్పి రెండో పెళ్లి చేసుకోవటమే కాదు.. భర్త నుంచి కోట్లాది రూపాయిలు కొట్టేసి.. ఉల్టా తనను వేధింపులకు గురి చేస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్న కిలేడీ దెబ్బకు సదరు రెండో భర్త హడలిపోతున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ కోర్టును ఆశ్రయించిన వైనం ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అసలేం జరిగిందంటే.. టోలిచౌకికి చెందిన 38 ఏళ్ల వ్యాపారవేత్త (సయ్యద్ హుస్సేన్)కు 31 ఏళ్ల జమీలా రవికుమార్ అనే మహిళతో 2021 నవంబరులో పరిచయమైంది. తాను గచ్చిబౌలిలోని నానక్ రాం గూడలోని హైహోం విహంగలో ఉంటున్నట్లుగా చెప్పింది. తనకు విదేశాల్లో వ్యాపారాలు ఉన్నట్లుగా చెప్పి.. తన తల్లి ఫిలింనగర్ లో ఉంటుందని చెబుతూ ఆమెను పరిచయం చేసింది. వారిద్దరు తమకు



వ్యాపారాలు ఉన్నాయని.. తన బాయ్ ఫ్రెండ్ రేధా ముస్సా ఇస్మాయిల్ అహ్మద్ తో విభేదాలు వచ్చినట్లుగా పేర్కొన్నారు.కొన్ని రోజుల తర్వాత సయ్యద్ హుస్సేన్ తో వ్యాపారం చేయాలనుకుంటున్నట్లుగా చెప్పి తనకు సినీ ప్రముఖులు.. సెలబ్రిటీలతో పరిచయాలు ఉన్నట్లుగా పేర్కొంది. తనను పెళ్లి చేసుకోవాలని కోరగా.. అతను నో చెప్పాడు. అయితే.. తప్పుడు ధ్రువపత్రాల్ని క్రియేట్ చేసి అతన్ని వివాహమాడింది. కొద్దికాలం తర్వాత తల్లీకూతుళ్లు సయ్యద్ ను ఇబ్బంది పెట్టటం మొదలుపెట్టారు. అతని వ్యాపార వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటంతో పాటు దాదాపు రూ.కోటి వరకు ఖర్చు చేశారు.అతని ఐఫోన్ నుంచి తెలీకుండా రూ.80 లక్షల మొత్తాన్ని తమ ఖాతాలోకి జమ చేసుకున్నారు. దీంతో వీరి మీద అనుమానం వచ్చిన హుస్సేన్ వీరి గురించి ఆరా తీశాడు. జమీలాకు ఇమ్రాన్ అనే వ్యక్తితో పెళ్లైందని.. వారికి పిల్లలు ఉన్నట్లుగా గుర్తించాడు. ఇదిలా ఉండగా వివిధ సందర్భాల్లో రూ.4 కోట్ల వరకు ఖర్చు చేసింది. వీటిని భరించలేని సయ్యద్ ఆమెను నిలదీయగా.. తాము ఉంటున్న ఇంటికి హుస్సేన్ ను రానివ్వకుండా అడ్డుకుంది.దీంతో తనకు న్యాయం చేయాలని బాధితుడు తొలుత ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాడు. అక్కడ ఎలాంటి ఫలితం లేకపోవటంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అయినా తన కంప్లైంట్ ముందుకు వెళ్లకపోవటంతో చివరకు కోర్టును ఆశ్రయించాడు. తన దగ్గర కొట్టేసిన నగదుతో వారు విదేశాలకు వెళ్లిపోయే వీలుందని.. వారి పాస్ పోర్టులు.. వీసాలు నిలిపివేసి.. తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో తల్లీకూతుళ్ల మీద కేసు నమోదైంది. ఈ మొత్తం వ్యవహారంలో మోసం చేశారని చెబుతున్న తల్లీకూతుళ్ల వెర్షన్ బయటకు రావాల్సి ఉంది.

# డాక్టర్ల పని ఖతమే వచ్చేశాయి రోబో డాక్టర్స్



**ఎలాన్ మస్క్:**ప్రపంచం శరవేగంగా మారుతోంది. టెక్నాలజీ అభివృద్ధి దాదాపు ప్రతి రంగాన్ని సమూలంగా ప్రభావితం చేస్తోంది. ఇదివరకే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆటోమేషన్ వల్ల వేలాది ఉద్యోగాలు కనుమరుగు కావడం మనం చూశాం. ఇప్పుడు ఈ ప్రభావం ఎంటర్టైన్మెంట్ రంగానికి కూడా విస్తరిస్తోంది. చిన్న వీడియోలు, వర్చువల్ యాక్టర్స్, వివిధ ఏఐ టూల్స్ వాడకం వల్ల సాంప్రదాయ సృజనాత్మక వృత్తులు తగ్గుముఖం పడుతున్నాయి.ఇప్పుడు అదే సాంకేతిక ప్రభంజనం వైద్య రంగంపై పడుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఎలాన్ మస్క్ వంటి అగ్రశ్రేణి టెక్ నాయకులు రాబోయే ఐదేళ్లలోనే రోబోలు మానవ సర్జన్ల కంటే మెరుగైన, అత్యంత ఖచ్చితమైన నైపుణ్యం చూపుతాయని వ్యాఖ్యానించడం ఈ మార్పు వేగాన్ని, అనివార్యతను సూచిస్తోంది. రోబోటిక్ సర్జరీలు, ఆటోమేటెడ్ డయాగ్నోస్టిక్ టూల్స్ వేగంగా అభివృద్ధి చెందుతూ, విస్తృతంగా అందుబాటులోకి వస్తున్నాయి.ఈ నేపథ్యంలో, భవిష్యత్ తరం వైద్యులు కేవలం వైద్య పరిజ్ఞానంతో సరిపెట్టుకుంటే సరిపోదు. వారు సాంకేతిక పరిజ్ఞానం, రోబోటిక్స్ అవగాహన, డేటా అనలిటిక్స్ వంటి ప్రత్యేక నైపుణ్యాలతో తమను తాము సన్నద్ధం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.ఒక కోణంలో చూస్తే, ఇది ఆరోగ్య రంగ అభివృద్ధికి అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది. టెక్నాలజీ సాయంతో ఎక్కువ మంది రోగులకు వేగంగా, అత్యంత కచ్చితమైన రోగ నిర్ధారణ మరియు చికిత్స అందించడం సాధ్యమవుతుంది. ఇది ఆరోగ్య సంరక్షణ లభ్యతను, నాణ్యతను పెంచుతుంది.కానీ మరోవైపు, సాంప్రదాయ పద్ధతుల్లో వైద్య విద్యను పూర్తి చేసుకున్న వారు లేదా చిన్న, మధ్య తరహా హాస్పిటల్స్ నడుపుతున్న వైద్యులు ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పోటీని తట్టుకోవడం కష్టమవుతుందనే ఆందోళన కూడా బలంగా వ్యక్తమవుతోంది.పరిస్థితిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగాలంటే, వైద్య వృత్తిదారులు తమ వృత్తి నైపుణ్యాలను కేవలం వైద్య శాస్త్రానికే పరిమితం చేయకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నా జీ, ఆటోమేషన్, డేటా సైన్స్ వంటి అనుబంధ రంగాలలో కూడా జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచుకోవాలి. ప్రపంచం కొత్త దిశగా పయనిస్తున్నప్పుడు, మానవతా విలువలను మరవకుండా, టెక్నాలజీని శత్రువుగా కాకుండా మిత్రుడిగా మార్చుకుంటూ, సమతుల్యతతో కూడిన అభివృద్ధిని సాధించడమే ప్రగతికి సరైన మార్గం అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వైద్య రంగంలో ఈ మార్పు అనివార్యం, దానికి సిద్ధంగా ఉండటమే భవిష్యత్ వైద్యుల ముందున్న ప్రధాన సవాల్.

# పాక్ చర్యలకు మద్దతుపై చైనా కీలక వ్యాఖ్యలు

**చైనా:**పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ కు చైనా మద్దతు పలికిన సంగతి తెలిసిందే! ఈ సమయంలో తాజాగా ఈ విషయంపై చైనా మరోసారి స్పష్టం చేసింది. ఇందులో భాగంగా... తన సార్వభౌమత్వాన్ని, భద్రతను కాపాడుకునేందుకు పాకిస్థాన్ తీసుకునే అన్ని చర్యలకు తాము మద్దతిస్తామని తెలిపింది.

అవును... భారత్ పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతలను చల్లార్చడానికి అవసరమైన అన్ని చర్యలను తాము స్వాగతిస్తామని చైనా పేర్కొంది. ఈ సందర్భంగా స్పందించిన చైనా విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ మీడియాతో మాట్లాడుతూ... పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై దర్యాప్తును కోరుకుంటున్నామని తెలిపింది.ఇదే సమయంలో... భారత్ పాక్ రెండు దేశాలకు పొరుగువారిగా సంయమనం పాటిస్తామని చైనా ఆశిస్తున్నట్లు గువో జియాకున్ తెలిపినట్లు రాయిటర్స్ నివేదించింది! ఇదే సమయంలో.. చైనా



విదేశాంగ మంత్రి వాంగ్ యి ఆదివారం పాకిస్థాన్ ఉప ప్రధాన మంత్రి, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ తో ఫోన్ లో మాట్లాడినట్లు కథనాలొచ్చిన సంగతి తెలిసిందే.ఈ సందర్భంగా స్పందించిన వాంగ్... అన్ని కాలాలకు అనుగుణంగా ఉండే వ్యూహాత్మక సహకార భాగస్వామిగా చైనా.. పాకిస్థాన్ చట్టబద్ధమైన భద్రతా సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుంటుందని.. దాని సార్వభౌమత్వాన్ని, భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవడంలో పాకిస్థాన్ కు మద్దతు ఇస్తుందని వాంగ్ చెప్పారు!కాగా... పహల్గాంలో జరిగిన హింస తర్వాత భారత్ - పాకిస్థాన్ సంబంధాలు బాగా క్షీణించిన సంగతి తెలిసిందే. ఈ దాడి వెనుక పాకిస్థాన్ లో శిక్షణ పొందిన ఇద్దరు కాశ్మీరీ కార్యకర్తలు ఈ దాడి వెనుక ఉన్నారని చెప్పిన భారత్... 1960 సింధూ జల ఒప్పందాన్ని నిలిపివేయడం, అట్టారిలోని ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టును మూసివేసిన సంగతి తెలిసిందే.ఈ సందర్భంగా... జమ్ముకశ్మీర్ లోని అనంత్ నాగ్ జిల్లాకు చెందిన ఆదిల్ థోకర్ లేదా ఆదిల్ గురీ అనే స్థానిక ఉగ్రవాది.. ఏప్రిల్ 22న జరిగిన దాడిని ప్లాన్ చేయడంలోనూ, అమలుచేయడంలోనూ పాకిస్థాన్ ఉగ్రవాదులకు సహకరించడంలో కీలక భూమిక పోషించాడని భారత్ భావిస్తోంది. ఈ దాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన సంగతి తెలిసిందే.

# కెనడాలో భారతీయ విద్యార్థిని అనుమానాస్పద మృతి



**కెనడా:**కెనడాలో మరో భారత విద్యార్థిని మరణం కలకలం సృష్టించింది. ఒట్టావా ప్రావిన్స్ లో అదృశ్యమైన వంశికా సైనీ మృతదేహం లభ్యమైనట్లు కెనడాలోని భారత హైకమిషన్ వెల్లడించింది. ఇదే సమయంలో... ప్రస్తుతానికి ఆమె మరణానికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు, త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

అవును... హర్యానాలోని 12వ తరగతి పూర్తి చేసిన వంశిక.. ఆ తర్వాత కెనడా వెళ్లింది. అనంతరం అక్కడ రెండేళ్ల హెల్త్ డిప్లొమా కోర్సు చేసింది. కాగా.. ఏప్రిల్ 18న ఫైనల్ పరీక్షలు పూర్తవ్వడంతో ఒట్టావాలోని ఒక కాల్ సెంటర్ పార్ట్ టైం లో చేరింది. ఏప్రిల్ 22న ఉద్యోగం కోసం బయలుదేరిన ఆమె, తిరిగి ఇంటికి వెళ్లలేదని తెలుస్తోందిస్థానిక మీడియా నివేదికల ప్రకారం ఆమె మృతదేహం బీచ్ లో కనిపించిందని తెలుస్తోంది. ఈ సందర్భంగా స్పందించిన భారత రాయబార కార్యాలయం 'ఎక్స్' లో ఓ పోస్ట్ పెట్టింది. ఇందులో భాగంగా... ఒట్టావాలో భారతదేశానికి చెందిన వంశిక సైనీ అనే విద్యార్థిని మరణించినట్లు తెలియగానే తాము చాలా బాధపడ్డామని తెలిపింది.ఈ సందర్భంగా స్పందించిన వంశిక సైనీ తండ్రి దేవిందర్ సైనీ.. తన కుమార్తె రోజూ తమతో మాట్లాడేదని.. కానీ, ఏప్రిల్ 22 తర్వాత ఫోన్ కూడా చేయలేదని రంధావా వెల్లడించారు. ఈ క్రమంలో ఏప్రిల్ 25న ఆమె కనిపించడం లేదని తనకు తెలిసిందని వివరించారు. అనంతరం.. ఆమె మృతదేహం బీచ్ లో కనిపించినట్లు పోలీసులు చెప్పారని వెల్లడించారు.

వంశిక సైనీ తండ్రి దేవిందర్ సైనీ చండీగఢ్ లోని దేరా బస్సీలో నివాసముంటున్నారు. ఈయన స్థానిక ఆమ్ ఆద్మీ పార్టీ నేత. ఇదే సమయంలో.. ఆ పార్టీ ఎమ్మెల్యే కుల్జిత్ సింగ్ రంధావాకు సన్నిహితుడు.కాగా... కెనడాలోని భారతీయులపై ఇటీవల కాలంలో దాడులు పెరిగిపోతోన్న సంగతి తెలిసిందే. ఒంటారియో హామిల్టన్ లోని మోహాక్ కాలేజీలో చదువుతున్న 21 ఏళ్ల హర్ సిమ్రత్ రాంధవా అనే విద్యార్థిని. ఇటీవల ఆమె బస్ స్టాప్ లో వేచి చూడగా.. ఆమెపై కారు నుంచి కాల్పులు జరగడంతో ఆమె మరణించింది. .

# సికింద్రాబాద్ నుంచి అంబేద్కర్ యాత్రా స్పెషల్

**సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యాత్ర విత్ పంచ జ్యోతిర్లింగ పుణ్యక్షేత్ర దర్శనం పేరిట ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ మరో టూర్ ప్యాకేజీని ప్రకటించింది. మహారాష్ట్రలో వెలిసిన ప్రఖ్యాత జ్యోతిర్లింగాలను ఈ ప్యాకేజీలో చేర్చింది.భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఆయా పుణ్యక్షేత్రాలను భక్తులు దర్శించుకోవచ్చు. ఎనిమిది రాత్రులు/ తొమ్మిది పగళ్లు సాగే యాత్రా స్పెషల్ ఇది. జులై 5వ తేదీన సికింద్రాబాద్ నుంచి భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరి వెళు ంది. మొత్తం 718 సీట్లు అందుబాటులో ఉంటాయి. ఇందులో స్లీపర్- 460, 3ఏసీ- 206, 2ఏసీ- 52.సికింద్రాబాద్ నుంచి బయలుదేరే ఈ ఎక్స్‌ప్రెస్‌కు కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముదే?డ్, నాందెడ్, పూర్ణ స్టేషన్లలల్లో హాల్ట్ సౌకర్యం ఉంది. ఆయా స్టేషన్లల్లో ప్రయాణికులు బోర్డింగ్/డీబోర్డింగ్ అవ్వొచ్చు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్



అంబేద్కర్ జన్మించిన మహవ్, దీక్షను స్వీకరించిన నాగ్‌పూర్‌ను ఈ ప్యాకేజీ ద్వారా సందర్శించవచ్చు. నాగ్‌పూర్- ఉజ్జయిని- మహవ్- నాసిక్, పుణే- ఔరంగాబాద్.. ఈ ప్యాకేజీలో ఉన్నాయి.నాగ్‌పూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన దీక్షా భూమి, అక్కడి శ్రీ స్వామినారాయణ్ మందిర్‌లను ఈ ప్యాకేజీ ద్వారా సందర్శించవచ్చు. ఉజ్జయిని- మహాకాళేశ్వరుడు, ఓంకారేశ్వరుడి జ్యోతిర్లింగాలు, మహవ్‌లో అంబేద్కర్ జన్మించిన ప్రదేశాన్ని దర్శించుకోవచ్చు. నాసిక్‌లో త్రయంబకేశ్వరుడి ఆలయం, పుణేలో భీమశంకర్, ఔరంగాబాద్‌లో ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగ క్షేత్రాల దర్శనం ఇందులో ఉంది.ఈ ప్యాకేజీ కోసం ఒక్కొక్కరు చెల్లించాల్సిన ఛార్జీ మొత్తం 14,700 రూపాయలు. ఇది ఎకానమీ అంటే స్లీపర్ క్లాస్. ఇందులో పిల్లలు అంటే 5 నుంచి 11 సంవత్సరాల్లోపు వారికి 13,700 రూపాయల ఛార్జీని నిర్ధారించారు. స్టాండర్డ్ కేటగిరీ (3ఏసీ)లో పెద్దలకు 22,900, పిల్లలకు 21,700 రూపాయలు, కంఫర్ట్ కేటగిరీ (2ఏసీ)లో పెద్దలకు 29,900, పిల్లలకు 28,400 రూపాయలను చెల్లించాల్సి ఉంటుంది.

## భారత్ భయంతో షాబాజ్ ప్రభుత్వం కీలక ఆదేశాలు



**జమ్మూ కాశ్మీర్ :**జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్ దాడి తర్వాత భయంతో వణికిపోని పాక్ నేత, ఆ దేశంలోని ప్రాంతం దాదాపు లేకపోవచ్చు. పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకు ంటామని భారత్ ప్రతిజ్ఞ చేసింది. దీంతో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు తగిన గుణపాఠం చెప్పడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసి భారత్ పాకిస్తాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలించింది.దీంతో పాటు పాకిస్తానీయులను దేశం నుంచి బహిష్కరించడం, శత్రు దేశానికి చెందిన యూట్యూబ్ ఛానెళ్లను బ్యాన్ చేయడం వంటి అనేక ఇతర చర్యలతో కూడా భారత్ పాక్ ను చావుదెబ్బకొట్టింది. ఎక్స్‌ప్రెస్ న్యూస్ నివేదిక ప్రకారం.. పాకిస్తాన్ నేషనల్ సైబర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ దక్షిణ, మధ్య ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలను గుర్తు చేస్తూ ప్రభుత్వం, కీలక మౌలిక్ సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడుల ముప్పు పెరుగుతోందని హెచ్చరి ంచింది.భారత్ ఈసారి తమను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని పాకిస్తాన్ భయపడుతోంది. అన్ని వైపుల నుంచి భారత్ తమపై దాడి చేస్తుందనే భయం కూడా వారిని వెంటాడుతోంది. సోమవారం ప్రభుత్వం ఒక సలహా నోటీసు జారీ చేసింది. హ్యాకర్లు పాకిస్తాన్‌పై సైబర్ దాడులు ప్రారంభించడానికి ప్రస్తుత ప్రాంతీయ అస్థిరత్వాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉందంటూ హెచ్చరించింది.ఈ రంగాలకు భయం!సైబర్ దాడులు రక్షణ, ఆర్థిక, మీడియా వంటి రంగాలను లక్ష్యంగా చేసుకోవచ్చని ఏజెన్సీ తెలిపింది. భద్రతా వ్యవస్థలను ఛేదించడానికి హ్యాకర్లు స్పియర్ ఫిషింగ్, మాల్వేర్, డీప్‌ఫేక్ వ్యూహాలను ఉపయోగించవచ్చని సలహాలో పేర్కొంది. "హ్యాకర్లు రహస్య సమాచారాన్ని దొంగిలించడానికి, సంస్థల ప్రైవసీను ఉల్లంఘించడానికి ప్రయత్నిం చవచ్చు" అని కూడా హెచ్చరించింది. తమ సైబర్ భద్రతా రక్షణను బలోపేతం చేయాలని, రాబోయే ముప్పుల పట్ల అప్రమత్తంగా సంస్థలను కోరారు.

## భారత్ తో జాగ్రత్త తమ్ముడికి కీలక సూచన చేసిన నవాజ్

**న్యూఢిల్లీ :**అనుభవానికి మించిన జ్ఞానం ఇంకేమీ ఉండదంటారు. ఇప్పుడు అలాంటి అనుభవాన్ని తన తమ్ముడికి వివరించే ప్రయత్నం చేస్తున్నారు పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య పెరిగిన ఉద్రిక్తతల్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యల



గురించి పాక్ ప్రధాని కం తన తమ్ముడు షెహబాజ్ కు కీలక సూచనలు చేస్తున్నారు తాజాగా తన సోదరుడ్ని కలిసి నవాజ్ ఆయనతో భారత్ తో వ్యవహరించాల్సిన తీరు గురించి చర్చించినట్లుగా చెబుతున్నారు.రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు సమిసిపోవాలంటే దౌత్య మార్గం ద్వారానే పరిష్కరించుకోవాలని చెప్పినట్లుగా తెలుస్తోంది. పహల్గాం దాడి అనంతరం భారత్ తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చేపట్టిన చర్యల్ని నవాజ్ షరీఫ్ కు వివరిస్తూ.. భారత్ వల్లే ఉద్రిక్తతలు పెరిగినట్లుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్పందించిన నవాజ్ షరీఫ్.. భారత్ తోదూకుడుగా వ్యవహరించొద్దని.. శాంతి పునరుద్ధరణ కోసం అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాల్ని వినియోగించుకోవాలని చెప్పినట్లుగా అక్కడి మీడియా చెబుతోంది.నవాజ్ షరీఫ్ వైఖరికి తగ్గట్లే.. ఆయన కుమార్తె పంజాబ్ ప్రావిన్స్ ముఖ్య మంత్రిగా వ్యవహరిస్తున్న మర్యమ్ సైతం తాజా పరిణామాలపై ఇప్పటివరకు స్పందించని అం శాల్ని ప్రస్తావిస్తున్నారు. పాక్ ప్రధానిగా వ్యవహరించిన నవాజ్.. తన పాలన సమయంలో ఆ యన వేసిన ఎత్తులు.. భారత్ నుంచి ఎదురైై తిప్పల మీద అనుభవం చాలానే ఉంది. ఈ నేపద ్యంలో ప్రస్తుత ప్రధానికి తన అనుభంంతో కూడిన సూచనలు చేసినట్లుగా చెబుతున్నారు. మరి.. పాక్ ప్రధానిపై తన అన్న నవాజ్ చెప్పిన మాటలు ఏ మేరకు ప్రభావితండిసైడ్ చేయాలి.

## ఐక్యరాజ్యసమితిలో దాయాదిని ఉతికేసిన భారత్




**పాకిస్థాన్ :**చేయాల్సిన దుర్మార్గాల్ని చేసుకుంటూ పోవటం.. ఏమీ తెలియని నంగనాచి మాదిరి అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడే తీరు దాయాది దేశానికి ఎక్కువే. నిత్యం విద్వేషాన్ని కక్కుతూ.. భారతదేశాన్ని ఏదో ఒక కష్టాన్ని తెచ్చి పెట్టటమే ఎజెండాగా కుట్ర పన్నే పాకిస్థాన్ కు సరైన రీతిలో షాకిచ్చింది భారత్. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ తమ దేశంలో హింసకు పాల్పడుతున్న పాక్ తీరును మరోసారి అంతర్జాతీయ వేదిక మీద భారత్ ఎండగట్టింది. పహల్గాం ఉగ్రదాడి అంశాన్ని ఐక్యరాజ్యసమితిలో లేవనెత్తిన భారత ప్రతినిధి.. ఈ సందర్భంగా పాక్ మంత్రి ఇటీవల చేసిన వ్యాఖ్యను ఉటంకించారు.ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని పాక్ మంత్రే స్వయంగా వెల్లడించిన వైనాన్ని ప్రస్తావిస్తూ పాక్ మీద మండిపడిన భారత ప్రతినిధి.. ఇకపై ప్రపంచం కళ్లు మూసుకొని ఉండిపోదని హెచ్చరించింది. న్యూయార్క్ లో జరిగిన ఉగ్రవాద అనుబంధ నెట్ వర్కు బాధితుల ప్రోగ్రాంలో ఐక్యరాజ్యసమితిలో భారత డిప్యూటీ శాశ్వత ప్రతినిధిగా వ్యవహరిస్తున్న యోజన పటేల్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా పాక్ తీరును తీవ్రంగా తప్పు పట్టారు.సీమాంతర ఉగ్రవాదానికి తాము బాధితులమని.. ఉగ్ర చర్యలతో బాధితులమని పేర్కొన్న ఆమె.. 'ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నామని.. ఉగ్ర సంస్థలకు నిధులు సమీకరిస్తున్నట్లు ఇటీవల పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసీఫ్ చెప్పిన మాటల్ని యావత్ ప్రపంచం వింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నామని వారు బహిరంగంగా అంగీకరించినా ఎవరూ ఆశ్చర్యపోలేదు. పాక్ ఎలాంటి మోసపూరిత దేశమో దీన్ని బట్టి మరోసారి స్పష్టమైంది. ఆ దేశం అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రపంచం ఇకపై కళ్లు మూసుకొని కూర్చోదు' అంటూ హెచ్చరించారు. భారత్ పై నిరాధార ఆరోపణలు చేయటానికి ఈ అంతర్జాతీయ వేదికను పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తుందని ఆమె నిప్పులు చెరిగారు.

# ఎండల దెబ్బకు బీర్లకు డిమాండ్..

**హైదరాబాద్:**రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఈ సంవత్సరం ఎండలు బాగా ఉంటాయని ఇప్పటికే వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఇక ఈ వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి చాలామంది చల్ల చల్లని బీర్ లను ఆశ్రయిస్తున్నారు. ఎండల దెబ్బను తట్టుకోవాలంటే బీర్ తాగాల్సిందే అని భావిస్తున్న మద్యం ప్రియులు కేసులకు కేసులు బీర్లు ఖాళీ చేస్తున్నారు.తెలంగాణలో డిమాండ్ కు తగ్గట్టు బీర్ల ఉత్పత్తిరాష్ట్రంలో సమ్మర్ సీజన్లో బీర్ లకు షార్టేజ్ లేకుండా డిమాండ్ కు తగ్గట్టుగా ప్రొడక్షన్ చేయాలని ప్రభుత్వం బేవరేజెస్ కంపెనీస్ కి ఇంతకుముందే అనుమతులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఒకపక్క ప్రజల డిమాండ్ కు తగ్గట్టు బీర్ల ఉత్పత్తి సంస్థలు సప్లై చేసేందుకు బీర్ల ఉత్పత్తిని పెంచినప్పటికీ రాష్ట్రంలో మాత్రం వైన్స్ లో, బార్ షాపులలో బీర్లు క్షణాలలో విక్రయం అవుతున్నాయి.ప్రస్తుతం రాష్ట్రంలో పెళ్లిళ్ల సీజన్ కూడా జోరుగా సాగుతున్న క్రమంలో వివాహ వేడుకలకు సంబంది ,ంచిన పార్టీలకు కూడా బీర్ల వినియోగం పెరిగింది. రాష్ట్రంలో బీర్ల అమ్మకాలు భారీగా పెరగడంతో ప్రభ ుత్వానికి భారీ ఆదాయం సమకూరుతుంది.



ఈ సీజన్లో ఎక్సైజ్ శాఖ అంచనాలకు తగ్గట్టు భారీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. గతేడాది కంటే కోటిన్నర కేసుల బీర్లు ఎక్కువగా అమ్మాలని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.ప్రతీరోజూ ఎంత తాగుతున్నారంటేప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు దాదాపు మూడు లక్షల బీర్ కేసులు అవుతున్నాయని సమాచారం. ఈ సీజన్ తప్ప మిగతా సాధారణ రోజులతో పోలిస్తే ఇది రెట్టింపు స్థాయిలో ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖ దాదాపు 5.48 కోట్ల కేసుల బీర్లు అమ్మితే, ఈ సంవత్సరం ఇది మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.ఏది ఏమైనప్పటికీ ప్రతిరోజు 3లక్షల బీర్ కేసులు అమ్ముడవుతున్నాయి అంటే మన వాళ్ళు ఏ రేంజ్ లో బీర్ లను ఖాళీ చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పోటీ పడి మరీ బీర్లు తాగేస్తున్న మందు బాబులు ఈ సీజన్ లో గతేడాది కంటే ఎక్కువ ఆదాయాన్నే ప్రభుత్వానికి అందించేలా ఉన్నారు.

# ఢిల్లీపై కోల్‌కతా విజయం

## నరైన్ తిప్పేశాడు
## ఆల్‌రౌండ్‌షోతో అదుర్స్
## ఢిల్లీపై కోల్‌కతా విజయం
## రేసులోనే నైట్‌రైడర్స్
## పోరాడిన డుప్లెసి, అక్షర్





న్యూఢిల్లీ: వరుస విజయాలతో జోరు చూపించిన ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్స్ ముంగిట తడబడుతోంది. గత నాలుగు మ్యాచ్‌ల్లో మూడింటిని కోల్పోగా.. అటు చావో రేవో తేల్చుకోవాల్సిన స్థితిలో కోల్‌కతా నైట్‌రైడర్స్ అద్భుత ప్రదర్శన కనబర్చింది. డుప్లెసి (62), అక్షర్ (43)ల పోరాటంతో గెలుపు దిశగా సాగుతున్న ఢిల్లీని స్పిన్నర్ సునీల్ నరైన్ (3/29) తన మ్యాజిక్ బంతులతో వెనక్కి లాగాడు. దీంతో 14 పరుగుల తేడాతో నైట్‌రైడర్స్ నెగ్గింది. 9 పాయింట్లతో ప్లేఆఫ్ ఆశలను సజీవంగానే ఉంచుకుంది. ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 9 వికెట్లకు 204 పరుగులు చేసింది. రఘువంశీ (44), రింకూ సింగ్ (36), నరైన్ (27) రాణించారు. స్టార్క్‌కు 3.. అక్షర్, విప్రజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 190 పరుగులు చేసి ఓడింది. చివర్లో విప్రజ్ నిగమ్ (38) ఆకట్టుకున్నాడు. వరుణ్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నరైన్ నిలిచాడు.

**స్పిన్నర్ల హవా:** భారీ ఛేదనలో ఢిల్లీకి తొలి ఓవర్‌లోనే ఝలక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న అభిషేక్ పోరెల్ (4)ను స్పిన్నర్ అనుకూల్ అవుట్ చేయగా, కాసేపటికే కరుణ్ నాయర్ (15), కేఎల్ రాహుల్ (7) వెనుదిరగడంతో ఢిల్లీ 60 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది. అయితే డుప్లెసి ఒంటరి పోరాటానికి కెప్టెన్ అక్షర్ సహకారం తోడవ్వడంతో రన్‌రేట్ పదికి తగ్గకుండా సాగింది. తొమ్మిదో ఓవర్‌లో డుప్లెసి 4,4,6తో 16 రన్స్ అందించాడు. 13వ ఓవర్‌లో స్కోరు 130కి చేరింది. ఈ దశలో జట్టు గెలుపు ఖాయమనిపించినా నరైన్ గట్టి దెబ్బతీశాడు. 14వ ఓవర్‌లో అతడు అక్షర్‌ను అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 76 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. దీనికి తోడు ఆరో బంతికి హిట్టర్ స్టబ్స్ (1)ను బౌల్డ్ చేయడంతో ఢిల్లీ షాక్‌కు గురైంది. ఇక 31 బంతుల్లో ఫిఫ్టీతో జోరు మీదున్న డుప్లెసిని తన తర్వాతి ఓవర్‌లోనే నరైన్ అవుట్ చేయడంతో మ్యాచ్ కోలల్‌తా వైపు తిరిగింది. పైగా 18వ ఓవర్‌లో అశుతోష్ (7), స్టార్క్ (0)లను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేయడంతో ఫలితం తేలిపోయింది. చివర్లో విప్రజ్ వేగంగా ఆడడం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది.

**చివర్లో తడబడ్డారు:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా ఇన్నింగ్స్ టాప్‌గేర్‌లో సాగినా.. చివర్లో అదుపు తప్పింది. ఆఖరి ఐదు ఓవర్లలో 45 పరుగులే చేసి 5 వికెట్లు కోల్పోయిన జట్టు కష్టంగా 200 దాటింది. రఘువంశీ, రింకూ సింగ్ మాత్రం ఎదురుదాడికి ప్రయత్నించి ఐదో వికెట్‌కు 61 పరుగులు జోడించారు. అంతకుముందు ఓపెనర్లు నరైన్, గుర్బాజ్ (26) అదిరే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్‌లో గుర్బాజ్ రెండు ఫోర్లు సాధించగా.. రెండో ఓవర్‌లో నరైన్ 6,4,6,4తో 25 పరుగులు రాబట్టాడు. ఇక తర్వాతి ఓవర్‌లోనే గుర్బాజ్ 4,4,6తో ధాటిని చూపి ఆరో బంతికి వెనుదిరిగాడు. అయినా తొలి వికెట్‌కు 18 బంతుల్లోనే 48 పరుగులు సమకూరాయి. ఆ వెంటనే కెప్టెన్ రహానె (26) బౌండరీల జోరుతో పవర్‌ప్లేలో జట్టు 79/1 స్కోరుతో పటిష్టంగా కనిపించింది. కానీ ఆ తర్వాత వరుస ఓవర్లలో నరైన్, రహానె వికెట్లు కోల్పోవడంతో స్కోరు 91/4కి చేరింది. కానీ రఘువంశీ రెండు సిక్సర్లతో తొమ్మిదో ఓవర్‌లో స్కోరు వందకి చేరుకుంది. వెంకటేశ్ అయ్యర్ (7) విఫలం కాగా స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ పరుగులను నియంత్రించారు. ఈ దశలో 15వ ఓవర్‌లో రింకూ 4,6,4తో 17 రన్స్ రాబట్టడంతో కాస్త కోలుకుంది. వీరి ధాటికి స్కోరు 220కి చేరుతుందనిపించింది. అయితే ఢిల్లీ బౌలర్లు ఈ ఇద్దరినీ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో తడబాటు ఆరంభమైంది. ఆఖరి ఓవర్‌లో తొమ్మిది పరుగులకే కేకేఆర్ మూడు వికెట్లు కోల్పోయింది. తొలి బంతికి రస్సెల్ సిక్సర్‌తో స్కోరు 200 దాటినా.. ఆ తర్వాత స్టార్క్ వరుస బంతుల్లో రెండు వికెట్లు తీయగా రస్సెల్ (17) రనౌటయ్యాడు.

# శ్రీవారి సేవలో టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్



టీమిండియా మాజీ పేసర్ శ్రీశాంత్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొన్నాడు శ్రీశాంత్. ఈ సందర్భంగా ఆలయంలోని వేద పండితులు శ్రీశాంత్ కుటుంబ సభ్యులకు వేదశీర్వచనం అందజేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.అలాగే పట్టు వస్త్రాలతో శ్రీశాంత్ దంపతులను సత్కరించారు. ఇక దర్శనానంతరం బయటకు వచ్చిన శ్రీశాంత్ తో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీ పడ్డారు.ఇక ఆలయం వెలుపల శ్రీశాంత్ మీడియాతో మాట్లాడుతూ%ొ% కుటుంబ సభ్యులతో . శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నాడు.ఇక ఐపీఎల్-2025పై స్పందిస్తూ చిన్న వయస్సులో వైభవ్ సూర్య వంశి అద్భుతమైన రీతిలో పరుగులు సాధిస్తున్నారని ప్రశంసలు కురిపించాడు. కామెంట్రీ బాక్స్ నుంచి ఆ మ్యాచ్ చూస్తూ ఉండటం చాలా ఆనందాన్ని ఇచ్చిందన్నాడు శ్రీశాంత్.

# భారత్‌దే రెండో వన్డే

### దక్షిణాఫ్రికా ఓటమి -మహిళల ముక్కోణపు సిరీస్



కొలంబో: మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత జట్టుకు రెండో విజయం దక్కింది. మంగళవారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లోనూ ఓపెనర్ ప్రతికా రావల్ (78) తన జోరును కొనసాగించడంతో పాటు, మహిళల వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 500 రన్స్ (8 ఇన్నింగ్స్) పూర్తి చేసిన బ్యాటర్‌గానూ నిలిచింది. ఇక బౌలింగ్‌లో స్నేహ్ రాణా (5/43) సఫారీల వెన్నువిరవడంతో భారత్ 15 పరుగులతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 276/6 స్కోరు సాధించింది. హర్మన్ (41), జెమీమా (41), మంధాన (36) రాణించారు. ఛేదనలో దక్షిణాఫ్రికా పోరాడినా చివర్లో తడబడింది. దీంతో 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. తజ్మిన్ బ్రిట్స్ (109) శతకం వృథా అయ్యింది. వోల్వార్ట్ (43), డెరెక్సెన్ (30) ఫర్వాలేదనిపించారు.

# పృథ్వీషా ఐకాన్ ప్లేయర్‌గా ఎంపిక



పృథ్వీషా.. ఒకప్పుడు టీమిండియా రైజింగ్ స్టార్‌గా పరిగణించబడ్డాడు. రాబోయే రోజుల్లో పృథ్వీషా భారత జట్టుకు కీలక బ్యాటర్ అవుతాడని.. భారత జట్టుకు కూడా నాయకత్వం వహిస్తాడని భావించారు. కానీ పేలవమైన ఫామ్, ఫిట్‌నెస్ పృథ్వీని వెనక్కి లాగేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో పృథ్వీ షాను ఏ ఫ్రాంచైజీ కూడా కొనుగోలు చేయలేదు. కానీ ఇప్పుడు మరో లీగ్ పృథ్వీ షాకు మద్దతు ఇచ్చింది. ఆ లీగ్ అతడిని ఏకంగా ఐకాన్ ప్లేయర్‌గా మార్చింది. ప్రస్తుతం దేశంలో ఐపీఎల్ తరహాలో ప్రతి రాష్ట్రం టీ20 లీగ్‌లను నిర్వహిస్తున్నాయి. ముంబై క్రికెట్ అసోసియేషన్ కూడా ఒక టీ20 లీగ్ ను నిర్వహిస్తోంది. దీన్ని ముంబై టీ20 లీగ్ అని పిలుస్తారు. కానీ పృథ్వీషా తిరిగి రావాలంటే అసాధారణంగా రాణించాల్సి ఉంటుంది. అప్పుడే మళ్లీ టీమిండియాలోకి వచ్చే అవకాశాలు ఉంటాయి. ముంబై టీ20 లీగ్ మే 26 నుంచి జూన్ 8 వరకు వాంఖడే స్టేడియంలో నిర్వహించబడుతుంది.



# సూర్యవంశీకి రూ. 10 లక్షల నగదు బహుమతి

ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన అద్భుత ప్రదర్శనతో దేశవ్యాప్తంగా సంచలనం రేపాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓ రాత్రిలోనే హీరోగా మారిన సూర్యవంశీ, ఐపీఎల్ చరిత్రలో అతి పిన్న వయస్కుడిగా (14 సంవత్సరాలు 32 రోజులు) శతకం సాధించిన ఘనతను సొంతం చేసుకున్నాడు. అంతేకాదు, అతను ఐపీఎల్‌లో రెండవ వేగవంతమైన సెంచరీ సాధించిన ఆటగాడిగా కూడా నిలిచాడు, యూసుఫ్ పఠాన్ రికార్డును అధిగమించి తన ప్రతిభను చాటేశాడు. ఈ అసాధారణ విజయంతో అతను భారత క్రికెట్‌కు ఒక కొత్త ఆశాకిరణంగా మారాడు.14 ఏళ్ల యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ తన అద్భుతమైన ప్రదర్శనతో ద్రవిడ్ విశ్వాసాన్ని నిలబెట్టాడు. 38 బంతుల్లో 7 ఫోర్లు, 11 సిక్సలతో 101 పరుగులు చేసిన వైభవ్, ఒక్కసారిగా స్టేడియం మొత్తం ఉర్రూతలూగేలా చేశాడు. బౌండరీలు, సిక్సర్లు సముద్రంలా ఎగిసిపడటంతో ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లు, ఈలలతో స్టేడియాన్ని కంపింపజేశారు. 17 బంతుల్లోనే అరుదైన హాఫ్ సెంచరీని సాధించి, 35 బంతుల్లోనే తన ఐపీఎల్ తొలి శతకం కొట్టి పలు రికార్డులు కూడా నెలకొల్పాడు. వరుసగా 6,4,6,4,4,6లు కొట్టి ఒక ఓవర్‌లోనే 30 పరుగులు రాబట్టిన వైభవ్, చివరకు తన జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు.వైభవ్ సూర్యవంశీ విజయాన్ని గుర్తించిన బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, అతనికి రూ. 10 లక్షల నగదు బహుమతిని ప్రకటించారు. ఈ సందర్భంగా నితీష్ కుమార్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో స్పందిస్తూ, వైభవ్‌ను అభినందించారు. “ఐపీఎల్ చరిత్రలో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడిగా నిలిచిన బీహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీకి అభినందనలు. అతని కృషి, ప్రతిభ భారత క్రికెట్‌కు కొత్త కీర్తి తెచ్చిపెడుతాయని ఆశిస్తున్నాను” అని పేర్కొన్నారు. అలాగే, గత సంవత్సరం అతనితో మరియు అతని తండ్రితో కలిసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్న ముఖ్యమంత్రి, ఫోన్ ద్వారా కూడా వ్యక్తిగతంగా అభినందించానని తెలిపారు.వైభవ్ సూర్యవంశీ అసాధారణ ఆటతీరు, అతని ప్రామిసింగ్ ఫార్మ్‌తో దేశవ్యాప్తంగా కోటానుకోట్లు మంది అభిమానులను ఆకర్షించాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ చిన్నారి ఆటగాడు, కేవలం తన వయసుతోనే కాదు, తన ఆటతీరు, ధైర్యంతోనూ అందరినీ ఆకట్టుకున్నాడు. అతని ఈ డ్రీమ్ ఇన్నింగ్స్ అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతి అతని విజయాన్ని మరింత గౌరవించింది.ఇదిలా ఉండగా, మే 1న జరిగే తదుపరి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను ఎదుర్కొనడానికి రాజస్థాన్ రాయల్స్ సిద్ధమవుతోంది. ఫామ్‌లో ఉన్న వైభవ్ మరోసారి తన అద్భుత బ్యాటింగ్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేయనున్నాడా అనే ఆసక్తి క్రికెట్ ప్రేమికుల్లో నెలకొంది. భవిష్యత్తులో వైభవ్ సూర్యవంశీ భారత జాతీయ జట్టులో స్థానం సంపాదించి దేశానికి గౌరవం తీసుకురావాలని ఎంతోమంది ఆకాంక్షిస్తున్నారు.



# నాకౌట్ ఆశలు ఆవిరి

### ఇండోనేసియా చేతిలో భారత్ ఓటమి
### సుదీర్మన్ కప్ ఫైనల్స్

గ్జియామెన్ (చైనా): సుదీర్మన్ కప్ ఫైనల్స్‌లో నాకౌట్ ఆశలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన పోరులో భారత బ్యాడ్మింటన్ జట్టు నిరాశపరిచింది. గ్రూప్-డిలో భాగంగా మంగళవారం జరిగిన తమ రెండో పోరులో భారత్ 1-4తో పటిష్ట ఇండోనేసియా చేతిలో ఓటమిపాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా జోడీ మాత్రమే గెలవగా.. సింగిల్స్‌లో స్టార్లు పీవీ సింధు, ప్రణయ్, మహిళల డబుల్స్‌లో ప్రియ/శ్రుతి, పురుషుల డబుల్స్‌లో హరిహరన్/రూబన్ జంటలు ఓటమిపాలయ్యారు. దీంతో క్వార్టర్స్ చేరకుండానే భారత జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆదివారం జరిగిన తమ తొలి పోరులో డెన్మార్క్ చేతిలో భారత్ ఓడిన సంగతి తెలిసిందే. దీంతో గ్రూప్‌లో తమకు ఆఖరిదైన ఇంగ్లండ్‌తో పోరు భారత్‌కు నామమాత్రం కానుంది.

## గ్యాప్ ను పూరించాలని చూస్తోన్న సంయుక్త!



సినీ ఇండస్ట్రీలో ఎవరికి ఎప్పుడు ఎలా ఛాన్సులొచ్చి బిజీ అయిపోతారో తెలియదు. అందుకే అంటారు ఇండస్ట్రీలో ప్రతీ శుక్రవారానికి స్టార్లు మారుతూ ఉంటారని. అలా సడెన్ గా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన భీమ్లా నాయక్ సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చి ఆ సినిమాలో రానాకు జోడీగా నటించి అందరి కళ్లలో పడింది సంయుక్త మీనన్. మొదటి సినిమానే పవన్ సినిమా కావడం, దానికి తోడు ఆ సినిమా హిట్ అవడంతో సంయుక్తకు ఆఫర్లు క్యూ కట్టాయి. రెండో సినిమాగా కళ్యాణ్ రామ్ తో బింబిసార చేసింది. ఆ సినిమా కూడా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఆ తర్వాత మూడో సినిమాగా సార్ సినిమాను ధనుష్ తో కలిసి చేసి మరో సూపర్ డూపర్ హిట్ ను అందుకుంది సంయుక్త. దీంతో కెరీర్ స్టార్టింగ్ లోనే బ్యాక్ టు బ్యాక్ విజయాలతో హ్యాట్రిక్ హిట్స్ అందుకున్న లక్కీ హీరోయిన్ గా సంయుక్త మారిపోయింది. సార్ తర్వాత మెగా మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ తో కలిసి విరూపాక్ష సినిమా చేస్తే ఆ సినిమా అందరినీ ఆకట్టుకుంది. విరూపాక్షలో ఏకంగా నెగిటివ్ టచ్ ఉన్న పాత్ర చేసి అందరినీ ఆశ్చర్యపరించింది సంయుక్త. విరూపాక్ష తర్వాత సంయుక్త డిమాండ్, క్రేజ్ మరింత పెరిగాయి. దీంతో అమ్మడికి ఆఫర్లు కూడా బాగానే వచ్చాయి. విరూపాక్ష తర్వాత రెండోసారి కళ్యాణ్ రామ్ తో డెవిల్ సినిమా కోసం జతకడితే ఆ సినిమా పెద్దగా ఆడలేదు. అయితే సంయుక్త నుంచి డెవిల్ తర్వాత మరో సినిమా వచ్చింది లేదు. సంయుక్త చేతిలో పలు ప్రాజెక్టులున్నప్పటికీ గతేడాది మాత్రం తన నుంచి ఒక్క సినిమా కూడా రాలేదు.గతేడాది వచ్చిన గ్యాప్ ను ఫుల్‌ఫిల్ చేయడానికి ఇప్పుడు సంయుక్త చాలా గట్టిగా ట్రై చేస్తోంది. ప్రస్తుతం అమ్మడి చేతిలో ఆరు సినిమాలున్నాయి. ఆ ఆరు ప్రాజెక్టుల్లో మూడు మైథాలాజికల్ సినిమాలే అవడం విశేషం. వాటిలో నిఖిల్ తో చేస్తున్న స్వయంభు, బెల్లంకొండ శ్రీనివాస్ హైంధవ, బాలయ్యతో చేస్తున్న అఖండ2 ఉన్నాయి. ఇవి కాకుండా శర్వానంద్ తో నారీ నారీ నడుమ మురారీతో పాటూ బాలీవుడ్ లో మహారాగ్ని క్వీన్స్ ఆఫ్ క్వీన్స్, మలయాళంలో రామ్ అనే సినిమా కూడా చేస్తోంది సంయుక్త. వాటిలో నారీ నారీ నడుమ మురారి సినిమా ఈ సమ్మర్ లో రిలీజ్ కానుండగా, అఖండ2 సెప్టెంబరులో రిలీజ్ కానుంది. ఎంతలేదన్నా ఈ ఇయర్ సంయుక్త నుంచి మూడు సినిమాలు రావడం పక్కా అని ఆమె లైనప్ చూస్తుంటే అర్థమవుతోంది.

## వివాదంలో విజయ్ దేవరకొండ...
### గిరిజన సంఘాల తీవ్ర ఆగ్రహం!



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదాస్పదంగా మారాయి. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడిన మాటలపై గిరిజన సంఘాలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తమను కించపరిచేలా విజయ్ మాట్లాడారని, వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే... ఇటీవల తమిళ నటుడు సూర్య నటించిన ఒక సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కశ్మీర్‌లోని పహల్గామ్ ఘటనపై స్పందించారు. ఉగ్రవాదులకు సరైన విద్యను అందించి, వారి ఆలోచనా విధానాన్ని మార్చడమే దీనికి పరిష్కారమని అన్నారు. 500 ఏళ్ల క్రితం గిరిజనులు (ట్రైబల్స్) ఘర్షణ పడినట్లుగా కశ్మీర్‌లో దాడులు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ట్రైబల్స్ అనే పదం వాడటంపై గిరిజన సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

500 సంవత్సరాల క్రితం కేవలం గిరిజనులు మాత్రమే ఘర్షణ పడినట్టుగా విజయ్ మాట్లాడటం సరికాదని వారు పేర్కొంటున్నారు. ఉగ్రవాదుల చర్యలను ప్రత్యేకంగా గిరిజనుల నాటి ఘర్షణలతో పోల్చడం తమను కించపరచడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గిరిజన సంఘాల ప్రతినిధులు తెలిపారు.

ఈ నేపథ్యంలో, విజయ్ దేవరకొండ తక్షణమే గిరిజన సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన విజయ్, తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరుతున్నారు. ఒకవేళ ఆయన క్షమాపణ చెప్పని పక్షంలో, తాము క్షమించేది లేదని గిరిజన సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ఈ వివాదంపై విజయ్ దేవరకొండ ఎలా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

## వాటర్ ఫాల్‌లో పడి మృతి చెందిన ‘ఫ్యామిలీ మ్యాన్ 3’ నటుడు



త్వరలో రాబోతున్న వెబ్ సిరీస్ ‘ఫ్యామిలీ మ్యాన్ 3’ నటుడు రోహిత్ బాస్ఫోర్ జలపాతంలో పడి మృతి చెందాడు. ఆదివారం గువాహటిలోని గర్భంగా వాటర్ ఫాల్స్ సమీపంలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఏప్రిల్ 27న మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఘటన జరిగినట్టు పోలీసులు తెలిపారు. తన సహచరులు 9 మందితో కలిసి రోహిత్ వాటర్ ఫాల్స్ వద్దకు పిక్‌నిక్‌కు వెళ్లాడని, ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అతడు అందులో పడి మరణించాడని పేర్కొన్నారు.

సాయంత్రం 4 గంటల సమయంలో తమకు సమాచారం అందిందని, 4.30 గంటలకు ఘటనా స్థలానికి చేరుకున్నామని రాణి పోలీస్ అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు. దాదాపు 6.30 గంటలకు రోహిత్ మృతదేహాన్ని ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది వెలికి తీశారని చెప్పారు. ఆయన మృతి వెనుక ఎలాంటి అనుమానాలు లేవని స్పష్టం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపామని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. అయితే, రోహిత్ కుటుంబ మాత్రం అతడి మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తోంది. అతడిని మారుమూల ప్రాంతానికి తీసుకెళ్లారని, మధ్యాహ్నం 12 గంటల వరకు అతడి ఫోన్ ఆఫ్‌లో ఉందని తెలిపారు. రోహిత్‌కు ఈత కూడా రాదని వివరించారు.

## సమ్మర్ కి పర్ఫెక్ట్ సినిమా ఇది..!



టాలీవుడ్ హీరోల్లో కంటెంట్ ఉన్న సినిమాలు చేస్తూ ప్రేక్షకుల నుంచి సూపర్ అనిపించుకుంటున్న హీరో శ్రీ విష్ణు. అతను లీడ్ రోల్ లో ఇవానా, కెతిక శర్మ హీరోయిన్స్ గా నటించిన సినిమా చసింగిల్. ఈ సినిమాను కార్తీక్ రాజు డైరెక్ట్ చేయగా గీతా ఆర్ట్స్ 2 బ్యానర్ లో విద్య కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి ఈ సినిమా నిర్మించారు. మే 9న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ట్రైలర్ ని నేడు రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కి నిర్మాత అల్లు అరవింద్ అటెండ్ అయ్యారు. చసింగిల్ ట్రైలర్ ఇలా రిలీజ్ అయ్యిందో లేదో అలా ఆడియన్స్ కి నచ్చేసింది. శ్రీవిష్ణు మరోసారి ఫన్ ఫిల్డ్ ఎంటర్టైనర్ ఈసారి ఇద్దరు అమ్మాయిలతో కలిసి చేయబోతున్నాడు. ఈ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో నిర్మాత అల్లు అర్వింద్ మాట్లాడుతూ ఈ సినిమా కథ కార్తీక్ రాజు చెప్పినప్పుడే చాలా నవ్వుకున్నానని అన్నారు. ఇద్దరు గెంతులేసే అబ్బాయిలు.. ఇద్దరు అందమైన అమ్మాయిలు చేసే హంగామా బాగుంటుందని అన్నారు. శ్రీవిష్ణు కామిక్ టైమింగ్ బాగుంటుంది.. అతనితో వెన్నెల కిషోర్ కాంబినేషన్ ఇంకా బాగుంటుందని అన్నారు అల్లు అరవింద్. ఇక ట్రైలర్ లో ఆడవాళ్లను కాక్రోచ్ తో పోల్చిన డైలాగ్ ఉంది. అటామిక్ బాంబ్ పేలినా కాక్రోచ్ కి ఏం కాదు. అంత బలంగా ఆడవాళ్లు ఉంటారని పాజిటివ్ గా వాడిన డైలాగ్ అది. దాన్ని ఎవరు తప్పుగా భావించవద్దు అని అన్నారు అల్లు అరవింద్. ఈ క్రమంలోనే సమ్మర్ కి ఫ్యామిలీతో సినిమా చూద్దమనుకునే వాళ్లు ఉంటారు.. ఈ ఎండలకి ఎయిర్ కండీషన్స్ లో కాసేపు కూర్చుందాం అనుకునే వాళ్లు ఉంటారు. అందుకే ఈ సమ్మర్ కి బాగా సూటయ్యే సినిమా సింగిల్. మే 9న మీరు డెఫినెట్ గా సినిమా చూసి ఎంజాయ్ చేస్తారని అన్నారు అల్లు అరవింద్.

గీతా ఆర్ట్స్ నుంచి బన్నీ వాసు బయటకు వెళ్తున్నాడన్న వార్తపై కూడా స్పందించారు అల్లు అరవింద్. బన్నీ వాసు, విద్య ఇద్దరు గీతా ఆర్ట్స్ కి రెండు కళ్ళ లాంటి వారని అన్నారు. అల్లు అరవింద్ చెప్పారని కాదు కానీ సింగిల్ ట్రైలర్ చూస్తే శ్రీవిష్ణు మరో సూపర్ హిట్ కొట్టడం గ్యారెంటీ అనిపించేలా ఉంది. సమ్మర్ కి బెస్ట్ ఎంటర్టైనర్ గా నిలిచేందుకు చసింగిల్ వస్తుంది.

## అభిమానులకు క్షమాపణ చెప్పిన సల్మాన్ ఖాన్



బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్, ఇతర తారలు పాల్గొనాల్సిన ప్రతిష్ఠాత్మక లండన్ ఈవెంట్ ‘బాలీవుడ్ బిగ్ వన్’ వాయిదా పడింది. మే 4, 5 తేదీలలో లండన్‌లో అట్టహాసంగా జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని ప్రస్తుతానికి నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు నిర్ణయించారు. ఈ విషయాన్ని సల్మాన్ ఖాన్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.పహల్గామ్ ఘటన నేపథ్యంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో అందరి క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈవెంట్‌ను వాయిదా వేయడమే సరైనదని భావించినట్లు సల్మాన్ ఖాన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. లండన్‌లోని అభిమానులు ఈ ప్రదర్శన కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, ఈ వాయిదా నిర్ణయం వారిని నిరాశపరుస్తుందని తనకు తెలుసని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అభిమానులందరికీ సల్మాన్ క్షమాపణలు తెలిపారు. ప్రజల భద్రత, శ్రేయస్సు తమకు అత్యంత ముఖ్యమని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సల్మాన్ వివరించారు. వీలైనంత త్వరలోనే ఈవెంట్ కొత్త తేదీలను ప్రకటిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వాస్తవానికి, ఈ ‘బాలీవుడ్ బిగ్ వన్’ కార్యక్రమంలో సల్మాన్ ఖాన్‌తో పాటు మాధురీ దీక్షిత్, వరుణ్ ధావన్, టైగర్ ష్రాఫ్, కృతి సనన్ వంటి పలువురు ప్రముఖ బాలీవుడ్ తారలు పాల్గొని ప్రదర్శనలు ఇవ్వాల్సి ఉంది.



## ‘శర్వా38’లో కీలక పాత్రలో..



చార్మింగ్ స్టార్ శర్వా తన మేడిన్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ‘శర్వా 38’ని ప్రారంభించడానికి సిద్ధంగా వున్నారు. ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. ఈ గ్రిప్పింగ్, హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాను శ్రీ సత్యసాయి ఆర్ట్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తారు. ఈ చిత్రం లో అనుపమ పరమేశ్వరన్ ని హీరోయిన్ గా ప్రకటించిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు కీలక పాత్ర కోసం డింపుల్ హయాతిని ఎంపిక చేశా రు. ఇది ప్రాజెక్ట్‌కు మరింత స్టార్ పవర్‌ని జత చేసింది. ఈ పవర్‌ఫుల్ పాత్రకు ప్రాణం పోసేందుకు డింపుల్ పర్ఫెక్ట్ ఛాయిస్. అనుపమ, డింపు ల్ ఇద్దరూ మంచి పాత్రలను పోషిస్తున్నారు. 1960లో ఉత్తర తెలంగా ణ, -మహారాష్ట్ర సరిహద్దులో సెట్ చేయబడిన ఈ సినిమా ప్రేక్షకులను మరపురాని అనుభూతిని అందించబోతోంది. ఈ చిత్రం హై-స్టేక్స్ పీరి యడ్ యాక్షన్ డ్రామాగా ఉండబోతోంది. సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.




## ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమా విడుదల తేదీ కన్ఫార్మ్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కేజీఎఫ్, సలార్ చిత్రాల డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఒక సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ‘ఎన్టీఆర్31’గా ఈ ప్రాజెక్ట్ రాబోతుంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ నెల 22 నుంచి తారక్ కూడా ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ అయినట్లు తెలుస్తోంది. అయితే, తాజాగా ఈ సినిమా గురించి మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. విడుదల తేదీని ప్రకటించారు.

ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర పోస్టర్‌ను పంచుకున్నారు. ఇక, పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందించనున్నారు. ఈ సినిమాకు ‘డ్రాగన్’ అనే టైటిల్ ప్రచారంలో ఉంది.